


# విజయభాను




విజయవాడ, గురువారం 26-10-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 142 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# కనీస వేతనాల అమలు ఏదీ?

- అసంఘటితరంగ కార్మికుల పొట్టగొడుతున్నారు
- కార్మిక సంక్షేమమా? సంక్షామమా?
- బిజెపి నేతల తీవ్ర ఆగ్రహం
- గోవర్ధన్, విష్ణుకుమార్ రాజు వాగ్బాణాలు



విశాఖ సిటీ : రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో గత 11 సంవత్సరాలుగా వారంతా తీవ్ర నష్టానికి గురౌతున్నారని, తెలుగు దేశం ప్రభుత్వం పేద, కార్మిక, బడుగు వర్గాల సంక్షేమానికి తీవ్రంగా కృషిచేస్తున్నామని గప్పాలు కొట్టడమే తప్ప చేసేది శూన్యమే అని భారతీయ జనతా పార్టీ నాయకులు తీవ్రంగా ఆరోపించారు. బుధవారం నగరంలో స్థానిక బిజెపి పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర కనీస వేతనాల సలహా మండలి అధ్యక్షుడు ఎ.గోవర్ధన్, శాసనసభలో భారతీయ జనతా పార్టీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు తెలుగుదేశం విధివిధానాలపై అమలుతీరుపట్ల విరుచుకుపడ్డారు. కనీస వేతనాల సలహా మండలిని నియమించకుండా ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పని చేస్తున్న సుమారు కోటిమంది కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కేంద్రం చేపడుతున్న విధానాలు అమలు పట్ల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు పొంతన లేకుండా పోతోందని పార్టీ నాయకులు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకూ కనీస వేతనాల మండలిని తరువాయి 2లో

డిసెంబర్ నాటికి ఎయిమ్స్

# మొదటి దశ పూర్తికి కృషి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్



గుంటూరుః ఎయిమ్స్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాస్. 2018 డిసెంబర్ నాటికి ఎయిమ్స్ మొదటి దశ నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్. బుధవారం మంగళగిరిలో నిర్మిస్తున్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ తరువాయి 2లో

# జ్వరాలపై మళ్లీ అదే సమాధానం!

- ఒక్కరూ మృతి చెందలేదట
- ఎలీసా పరీక్షలో తేలితేనే.. డెంగీ
- ఒక్క ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్ష కేంద్రం
- వైద్య శాఖ తీరుపై సభ్యుల అసంతృప్తి
- ప్రతి నియోజకవర్గానికి ప్లేట్‌లెట్స్ వేరు చేసే యంత్రాలు
- నవంబరు 2 నుంచి కాలువలకు నీరు
- కీలక అంశాలపై చర్చించిన జడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరుః మీరు చెప్పే లెక్కలు చూస్తే జిల్లాలో 27 వేల మంది మాత్రమే జ్వరాలతో బాధపడుతున్నారా? సున్నాకు విలువ లేదని తీసేశారా? జ్వరాల నియంత్రణకు మీరు చేపట్టిన చర్యలు ఏంటి? జ్వరాలతో చస్తున్నా ఒక్క మరణం లేదన్నట్లు లెక్కలు చెబుతున్నారు. ఒక్కసారి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చూడండి. జ్వరాలతో ఎంత మంది ఆసుపత్రుల తరువాయి 2లో





గుజరాత్ ఎన్నికల

# షెడ్యూల్ విడుదల

దిల్లీ: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల ప్రధాన అధికారి అచల్ కుమార్ జోతి తెలిపారు. 182 అసెంబ్లీ స్థానాలకుగానూ రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 9న తొలిదశ, డిసెంబర్ 14న రెండో దశ ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి దశలో 19 జిల్లాల్లోని 89 తరువాయి 2లో

టిప్పు సుల్తాన్‌పై

# రాష్ట్రపతి సంచలన ప్రసంగం



న్యూఢిల్లీ: మైసూర్ పాలకుడు టిప్పు సుల్తాన్ గొప్ప యుద్ధ వీరుడని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వ్యాఖ్యానించారు. విధాన సౌధ 60వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం కర్నాటక అసెంబ్లీ, శాసనమండలి సంయుక్త సమావేశంలో ఆయన ప్రసంగించారు. బ్రిటిష్ పాలకులపై పోరాడుతూ టిప్పు సుల్తాన్ వీరమరణం పొందారు. యుద్ధంలో మైసూర్ రాకెట్లకు ఆయనే నాంది పలికారు.. అని కొనియాడారు. రాష్ట్రంలోని జీవన వైవిధ్యంపై తరువాయి 2లో


# ప్రధాని మోదీ సరికొత్త రికార్డు!



న్యూఢిల్లీ: సోషల్ మీడియా ప్రపంచంలో అత్యధిక ఫాలోవర్లున్న దేశాధినేతగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హవా కొనసాగుతూనే ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన ఫాలోవర్ల సంఖ్య తాజాగా కోటిమందికి చేరింది. ఇప్పటివరకు ప్రధానమంత్రి 152 ఫొటోలు షేర్ చేసుకున్నారు. ఆయన ప్రయాణాలు, ఇతర నేతలతో సమావేశాలు సహా ఇటీవల జరిగిన పండుగలకు శుభాకాంక్షలు తెలుపుతూ పలు పోస్టులు ఇందులో ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ట్వింప్లొమసీ అనే సంస్థ ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లున్న నాయకుడిగా ప్రధాని మోదీని ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా సోషల్ మీడియాను ఉపయోగిస్తున్న ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలపై ట్వింప్లొమసీ అధ్యయనం చేస్తుంటుంది. ప్రస్తుతం 78 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మోదీ తర్వాత రెండో స్థానంలో ఉన్నారు. ఆయన 2,472 ఫొటోలు తరువాయి 2లో

# జనసేన కార్యాలయ ప్రారంభం

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో ఆధునిక హంగులతో ఏర్పాటుచేసిన జనసేన పార్టీ పరిపాలనా కార్యాలయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బుధవారం ప్రారంభించారు. భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి సర్వమత ప్రార్థనల నడుమ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. పార్టీ పరిపాలనా తరువాయి 2లో



# లండన్‌లో 'బాబు' బిజీబిజీ..

అమరావతి: లండన్‌లో పర్యటిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిజీ బిజీగా ఉన్నారు. రెండో రోజైన బుధవారం నార్మన్ ఫోస్టర్ రూపకర్తలతో తరువాయి 2లో






## టేకిట్ ఈజీ



నిజమే సుమా...
ఇన్నాళ్ళకి రాహుల్ కరెక్ట్‌గా అన్నాడు !!

# ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

## అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టరు



నెల్లూరు: జిల్లాలో వివిధ శాఖలకు వచ్చిన ప్రజా ఫిర్యాదులు, సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టరు రేవు ముత్యాలరాజు అధికారులకు ఆదేశించారు. సాయంత్రం నగరంలోని కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించిన ఫిర్యాదులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులలో సీఎం కనెక్ట్ పరిష్కారవేదిక(1100), ఎలర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సోషల్ మీడియా విభాగాలు ఉన్నాయని, ఆయా విభాగాలలో వచ్చిన ఫిర్యాదులు, సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అన్నారు. త్వరలో ముఖ్యమంత్రి సమస్యలు పరిష్కరించే విధానాన్ని సమీక్షిస్తారని, కావున మూడు రోజుల్లో తమకు అందిన ఫిర్యాదులను ఆయా శాఖలు పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

# యువ ఇంజినీర్లకు నెలాఖరులోగా పోస్టింగ్‌లు



కర్నూలు : కొత్తగా నియమించిన 518 ఏఈఈలకు నెలాఖరులోగా స్థానాలు కేటాయించనున్నారు. ఈమేరకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈనెల 22న రాష్ట్రవ్యాప్తంగా 12 కేంద్రాల్లో రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కులు, ప్రతిభ ఆధారంగా ఆయా జిల్లాలకు కేటాయించనున్నారు. ముఖ్య ప్రాజెక్టులు, కార్యాలయాలకు ప్రతిభ ఆధారంగా నియమించనున్నారు. జిల్లాలో జలవనరుల శాఖ పరిధిలో 104 ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉండగా 50 మందిని నియమించే అవకాశముంది. కర్నూలు సర్కిల్ పరిధిలో 28 ఖాళీగా ఉండడగా 20 మందిని, ఎస్‌ఆర్‌బీసీ-2 సర్కిల్‌కు 15 మంది, టీజీపీకి 10, హంద్రీనీవాకు 5 మంది చొప్పున కేటాయించనున్నారు. ఈమేరకు ఆయా సర్కిళ్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

## గిరిజన పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్

ఒంగోలు : విశాఖపట్నం అరకువ్యాలీలోని గిరిజన ప్రత్యేక క్రీడా పాఠశాలలో 2017-18వ ఏడాదికి 5 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

ఇక్కడ మొత్తం 48 సీట్లు అందు బాటులో ఉండగా, 5వ తరగతి బాలురకు 30 సీట్లు, 6వ తరగతికి 11, 7వ తరగతికి 5, 8వ తరగతికి 1, 9వ తరగతికి 1 సీటు చొప్పున కేటాయించినట్లు తెలిపారు.

జిల్లా స్థాయి ఎంపిక ఈ నెల 26న ఒంగోలులో జరగనుందని పేర్కొన్నారు.

శిక్షణ విషయాని కొస్తే.. ఆర్చరీ, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, వెయిట్ లిఫ్టింగ్, హ్యాండ్ బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ క్రీడల్లో శిక్షణ ఇస్తారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2016-17వ ఏడాదిలో 5 నుంచి 9వ తరగతిలో ఏదో ఒక తరగతి చదువుతున్నవారై ఉండాలని, వయో పరిమితులు కూడా వర్తిస్తాయని పేర్కొన్నారు. జిల్లా ఎంపికలు ఈ నెల 26న ఒంగోలు కొత్త పట్నం రోడ్డులోని నెక్స్‌జన్ పాఠశాలలో ఉంటా యని, పూర్తి వివరాలకు 08592-280644, 9866317306, జిల్లా ఛైర్మన్ చిట్టి బాబును 9491060947 సెల్ ఫోన్ నెంబరు లోను, జిల్లా సమన్వయకర్త ఆర్.రాణాదేవ్‌ను 9849188170 నెంబరులోను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## విధులకు ప్రశాంతంగా హాజరు కావాలి

ఒంగోలు : విరామ సమయంలో తగినంత విశ్రాంతి తీసు కుని విధులకు ప్రశాంతంగా హాజరు కావాలని ఆర్టీసీ ఆర్ఎం ఆదాం సాహెబ్ సిబ్బందికి సూచించారు. ఆర్టీసీ తరపున ఎలాంటి రోడ్డు ప్రమాదాలు లేకుండా చూసే చర్యల్లో భాగంగా ఆర్ఎం కార్యాలయంలో డ్రైవర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడారు. తగినంత విశ్రాంతి తీసుకోవడం ద్వారా తిరిగి ఉత్తేజంగా విధులకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఒంగోలుతో పాటు మార్కాపురం లోనూ శిక్షణ జరుగుతున్నట్లు వెల్లడించారు. అనంతరం డీఎం శ్రీనివాసరావు, చీఫ్ ట్రాఫిక్ మేనేజరు మురళి తదితరులతో కలిసి ఆర్ఎం డ్రైవర్ల సామర్థ్యం పరిశీలిం చేందుకు స్వయంగా కాసేపు బస్సులో కలియతిరిగారు.

## ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టరు



నెల్లూరు : జిల్లాలో వివిధ శాఖలకు వచ్చిన ప్రజా ఫిర్యాదులు, సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టరు రేవు ముత్యాలరాజు అధికారులకు ఆదేశించారు. నగరంలోని కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిం చారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించిన ఫిర్యాదులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులలో సీఎం కనెక్ట్ పరిష్కారవేదిక(1100), ఎలర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సోషల్ మీడియా విభాగాలు ఉన్నాయని, ఆయా విభాగాలలో వచ్చిన ఫిర్యాదులు, సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అన్నారు. త్వరలో ముఖ్యమంత్రి సమస్యలు పరిష్కరించే విధానాన్ని సమీక్షిస్తారని, కావున మూడు రోజుల్లో తమకు అందిన ఫిర్యాదులను ఆయా శాఖలు పరిష్కరిం చాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

## పెద్దనోట్ల రద్దు రోజు బ్లాక్ డే!

### 8న కాంగ్రెస్, డీఎంకే రాష్ట్ర వ్యాప్త ఆందోళన

చెన్నై : గతేడాది కేంద్రం ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు రోజైన నవంబరు 8ని డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు చీకటి రోజుగా ప్రకటించాయి. ఈ మేరకు ఆ పార్టీలు ఒక ప్రకటన విడుదల చేశాయి. అందులో పెద్దనోట్ల రద్దు అయి ఏడాది అవుతోందని, మొదటి వార్షికోత్సవమైన ఎనిమిదో తేదీని చీకటి రోజుగా పరిగణిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు చేపట్టనున్నట్లు పేర్కొ న్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఇతర పార్టీల ఆధ్వర్యంలో ఈ నిరసన ప్రదర్శనలు చేస్తున్నా మని, అందులో భాగంగా రాష్ట్రంలో కూడా చీకటి రోజుగా నిర్వహించనున్నట్లు డీఎంకే కార్య నిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆ రోజు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు నల్ల దస్తులు వేసుకుని నిరసన ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. పెద్ద నోట్ల రద్దుతో ఇబ్బందులు పడ్డ వారంతా నల్ల బ్యాడ్జీలు ధరించి ఈ ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు గులాంనబీ ఆజాద్ దిల్లీలో ప్రకటన చేసిన అనంతరం రాష్ట్రంలో డీఎంకే ప్రకటన చేయడం గమనార్హం. అలాగే తిరునల్వేలి జిల్లాలో కుటుంబం ఆత్మ హత్యాయత్నం, మత్స్యకారులపై పోలీసుల లాఠీఛార్జీ తదితర అంశాలపై ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. ఈ రెండు ఘటనల్లో బాధితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.

## రాష్ట్ర స్థాయి ఇ-స్కూల్ గేమ్స్‌లో పురపాలక పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఆదోని : శ్రీకాకుళం జిల్లాలో జరిగిర రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో ఆదోని పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడం పట్ల పురపాలక సంఘం కమిషనర్ రామలింగేశ్వర్ అభినందించారు. 9వ తరగతి వీరేష్ అనే విద్యార్థి అండర్ 14 విభాగంలో 200 మీటర్ల విభాగంలో రజతం, 80 మీటర్ల హార్టిల్స్ విభాగంలో కాంస్యం, 4100 రిలే విభాగంలో కాంస్యం పతకం సాధించారు. ఎం.సాగర్ అనే 10వ తరగతి విద్యార్థి అండర్-17లో 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, 10వ తరగతి విద్యార్థి రాజేష్ 800 మీటర్ల రిలే విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కమిషనర్ కాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు మోహన్‌రావు, సిద్ధప్ప, నరసయ్య, ఖలీల్, జుబేర్, పీఈటీలు ఈశ్వరమ్మ, ముజాహిద్దీన్ హుస్సేన్ పాల్గొన్నారు.

## కన్యాశ్రీ సురక్ష యోజన ప్రారంభం

పర్లాఖెముండి : ఇక్కడి నవజీవన్ ఆశ్ర మంలో 12 ఏళ్లు పూర్తయిన ఆడపిల్లల కోసం కన్యాశ్రీ సురక్ష యోజనను తిరుపతికి చెందిన నవజీవన్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీధర్ ఆచార్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ బాలికలకు అందజేసిన హుండీలలో ప్రతినెలా రూ.300 వేస్తామన్నారు. వీరి పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచి అందులో ఈ సొమ్ము జమచేస్తా పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన అనంతరం ఆ బాలికల ఉన్నత విద్యకు లేక వారి వివాహానికి వెచ్చిస్తామని వివరించారు. పర్లాఖె ముండి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడపిల్ల జన్మిస్తే ఆ తల్లీ బిడ్డలకు మూడు నెలలకు సరిపడే మందులు, ఆహారం వంటి వస్తువులున్న కిట్ ఇచ్చేందుకు ఓ పథకం రూపొందించామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు వైద్యాధికారి వి.లోక్‌నాథ్‌రాజు మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రతినెలా 250 ప్రసవాలు జరుగు తున్నాయని వారిలో సగం మంది ఆడపిల్లలు జన్మిస్తున్నారన్నారు. ఈ పథకం పేదలకే పరిమి తం కాకుండా అందరికీ వర్తింపజేస్తే బాగుం టుందని సూచించారు. శ్రీధర్ ఆచార్య మాట్లా డుతూ సూచన పరిశీలిస్తామన్నారు. కార్య క్రమంలో జిల్లా ఛైల్డ్‌లైన్ అధికారులు ఎ.కె.త్రిపాఠి, బినోద్‌చంద్ర జెన్నా, బాగుసలకు చెందిన జి.మోహనరావు, ఆశ్రమ అధికారులు ఎస్.వెంకటరమణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## కాశీనగర్‌లో కొండచిలువ



పర్లాఖెముండి : కాశీనగర్ పట్టణ సమీపంలో కోనేరు వద్ద పోలాకి సింహాచలం అనే వ్యక్తి పచ్చగడ్డి కోస్తూ 8 అడుగుల పొడవుగల కొండచిలువను గమనించాడు. స్థానికుల సహాయంతో పామును పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. అధి కారులు పామును సియాలి అడవిలో విడిచిపెట్టారు.

## ధ్వని, వెలుగు ప్రదర్శనకు కళాకారుల ఎంపిక

సపేటె : హంపీ ఉత్సవాల్లో సుమారు 9 రోజుల పాటు సాగే ధ్వని, వెలుగు(కర్ణాటక వైభవ) కార్యక్రమానికి కళాకారుల ఎంపిక ప్రక్రియ స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో జరిగింది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలో సంగీత, నాటక విభాగానికి చెందిన మనోహర్, డాక్టర్ శీలా శ్రీధర్, అక్కమహాదేవి, స్థానిక నిపుణుడు ఓబయ్య ఈ ప్రక్రియలో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ధ్వని వెలుగు కార్యక్రమానికి కేవలం వంద మంది మాత్రం కళాకారుల అవసరం ఉంది. కానీ సుమారు 200 మంది వరకు కళాకారులు వచ్చారు. న్యాయనిర్ణేతలు వారందరి ప్రతిభను పరీక్షించారు. కర్ణాటక మొదటి రాజులు కదంబల మొదలు, హోయ్సళులు, అనంతరం విజయనగర సామ్రాజ్యం, టిప్పుసుల్తాన్, మన స్వాతంత్ర్య సంగ్రామం, రాజ్యాంగ రచన, కర్ణాటక రాష్ట్ర ఏకీకరణ వరకు జరిగిన ప్రముఖ సంఘటనలను ఇక్కడ కర్ణాటక వైభవ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శిస్తారు. నవంబరు 3 నుంచి 9వరకు గజశాల వద్ద ఈ కార్యక్రమం ఉంటుంది.

## డిసెంబరులోపు ప్రభుత్వం పడిపోతుంది

### పన్నీర్‌సెల్వంపై వేటు తప్పదు

### టీటీవీ దినకరన్



చెన్నై : ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం డిసెంబరులోపు పడిపోతుందని, అలాగే ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం అనర్హుడిగా మిగులుతారని టీటీవీ దినకరన్ జ్యోష్యం చెప్పారు. చెన్నై నగరంలోని రామాపురంలో ఎంజీఆర్ శతజయంత్యుత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దినకరన్ మాట్లాడుతూ పళని స్వామి ప్రభుత్వం డిసెంబరు లోపు పడిపోతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి ప్రస్తు తం సహకరిస్తున్న ఉప ముఖ్య మంత్రి పన్నీర్‌సెల్వంతోపాటు 12 మంది శాసన సభ్యులు ఈ ఏడాది ఫిబ్రవరిలో శాసన సభలో పళనిస్వామి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారని, వారిపై త్వరలో వేటు పడుతుందన్నారు. గతంలో రామాపురంలో దివంగత నేత ఎంజీఆర్ నివసించారని, అదేచోట నిర్వహించిన ఆయన శతజయంతి వేడుకల్లో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. అత్త శశికళ ఆదేశాలకు అనుగుణంగానే ఇక్కడ ఈ వేడుకలు నిర్వహించామన్నారు. అన్నాడీఎంకే ఎన్నికల గుర్తు రెండాకుల చిహ్నం విషయం ఈసీ పరిధిలో ఉందని, సరైన నిర్ణయం రావాలనే తాము విచారణను వాయిదా కోరామన్నారు. తప్పకుండా రెండాకుల గుర్తు తమకే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆర్కేనగర్ ఉప ఎన్నికలో తాను పోటీ చేస్తానని, తప్పక గెలుస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థులు సహాయాలు అందజేశారు. వారితో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో శశికళ, దినకరన్ మద్దతుదారులు, అభిమానులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## కనీస వేతనాల అమలు ఏదీ?

నియమించకపోవడం చాలా దారుణమని అన్నారు. శాసనసభ్యునిగా ఎన్నికైన డొక్కా మాణిక్య వరప్రసాద్ కనీస వేతనాల సలహా మండలి అధ్యక్ష పదవిని చేపట్టిన తరువాత మండలిలో కొత్త నియామకాలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. సుమారు 74 సంస్థలలో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలు నిర్ణయించాల్సి ఉందని అందుకు భిన్నంగా వారికి గత 11 సంవత్సరాల కిందటి కాలంలో ఇస్తున్న జీతాలే నేటికీ అదే లెక్కలో అందుతున్నాయని దుమ్మెత్తి పోశారు. నేడు మార్కెట్‌లో వస్తువుల ధరలు మండిపోతుంటే జీతాలు తెచ్చుకుంటున్న ప్రభుత్వోద్యోగులే ఏం కొంటాం..? ఏం తింటాం.. అనే రీతిలో ఆలోచిస్తుంటే ఇక సామాన్య మానవుని పరిస్థితి వేరే చెప్పాలా? అసంఘటిత రంగ కార్మికుల బదుకు దుర్భరంగా గడపాల్సి వస్తోందని, ఒక పూట తినడానికి ఉంటే మరోపూట తినడానికి వెతుక్కోవలసి వస్తోందని విచారించారు. ఇటీవల ఢిల్లీలో కనీస వేతనాల అమలుః సూచనలు - సలహాలపై సదస్సు జరిగితే అక్కడికి అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రులు హాజరయి వారి వారి సలహాలు, సూచనలు తెలియజేశారు. కానీ మన రాష్ట్రం నుంచి ప్రతినిధులైనా హాజరు కాకపోవడం విచారకరమని అన్నారు. జీతాలు పెంచడం లేదు సరికదా కార్మికుల సంక్షేమం మాట అటుంచి వారి సంక్షామానికి కృషి చేస్తున్నట్లున్నదని విష్ణుకుమార్ రాజు విమర్శించారు. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన తరువాతైనా చంద్రబాబు కనీస వేతనాల అమలుపై సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయడం వలన పిఎఫ్, వైద్య సదుపాయాల వంటి సౌకర్యాలు పొందగలుగుతున్నారని గోవర్ధన్ అన్నారు. ఈ సమావేశంలో బిజెపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## గుజరాత్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

నియోజకవర్గాలకు, రెండో దశలో 14 జిల్లాల్లోని 93 నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 18న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అదే రోజు ఫలితాలను కూడా ప్రకటిస్తారు.

***తొలి దశ ఎన్నికల ప్రక్రియ ఇలా..***

నవంబర్ 14- నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
నవంబర్ 21- నామినేషన్ల దరఖాస్తుకు చివరి తేదీ
నవంబర్ 22- నామినేషన్ల పరిశీలన
నవంబర్ 24- నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు
డిసెంబర్ 9- పోలింగ్ నిర్వహణ

***రెండో దశ ఎన్నికల ప్రక్రియ ఇలా..***

నవంబర్ 20- నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
నవంబర్ 27- నామినేషన్ల దరఖాస్తుకు చివరి తేదీ
నవంబర్ 28- నామినేషన్ల పరిశీలన
నవంబర్ 30- నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు
డిసెంబర్ 14- పోలింగ్ నిర్వహణ

2018 జనవరి 22కు గుజరాత్ అసెంబ్లీ కాలం ముగుస్తుంది. దీంతో డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించనున్నారు. గుజరాత్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 4.33 కోట్లు. ఎన్నికల కోసం 50,128 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఈసీ తెలిపారు. అన్ని కేంద్రాల్లోనూ వీవీప్యాట్‌ఈవీఎంలను ఏర్పాటు చేయనున్నారు. కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలతో నిఘా ఉంచనున్నారు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థుల ఖర్చు రూ.28లక్షలకు మించరాదని జోతి స్పష్టం చేశారు.

## టిప్పు సుల్తాన్‌పై రాష్ట్రపతి సంచలన ప్రసంగం

ఆయన మాట్లాడుతూ.. పురాతన జైనులకు, బౌద్ధ సంప్రదాయాలకు ఈ నేల ప్రసిద్ధి చెందింది. ఆదిశంకరాచార్యుడు ఇక్కడే శృంగేరి మఠాన్ని నెలకొల్పాడు. గుల్బర్గా ప్రాంతం సూఫీ సంస్కృతికి కేంద్రంగా విలసిల్లింది. కర్నాటకలోనే బసవాచార్య నేతృత్వంలో లింగాయత్ ఉద్యమం పురుడుపోసుకుంది.. అని ఆయన పేర్కొన్నారు.

ఘనమైన ఆధ్యాత్మిక చరిత్రతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలకు, వ్యవసాయానికి కర్నాటక ప్రసిద్ధి చెందిందన్నారు. భారత సైన్యానికి సైతం కర్నాటక అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. మన సైన్యంలోని ఇద్దరు చీఫ్‌లు ఫీల్డ్ మార్షల్ కేఎమ్ కరియప్ప, జనరల్ కేఎస్ తిమ్మయ్య కర్నాటక బిడ్డలే..అని రాష్ట్రపతి కోవింద్ గుర్తుచేశారు. టిప్పు సుల్తాన్ నిరంకుశుడంటూ బీజేపీ నేతలు తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన ప్రసంగంలో స్పష్టమైన వైఖరిని వెల్లడించడం గమనార్హం.

## *ప్రధాని మోదీ సరికొత్త రికార్డు!*

షేర్ చేసుకున్నారు. కాగా 49 లక్షల మంది ఫాలోవర్లున్న పోప్ ఫ్రాన్సిస్ మూడో స్థానంలో ఉన్నారు. ఆయన 467 పోస్టులు పెట్టారు.

## జనసేన కార్యాలయ ప్రారంభం

సౌలభ్యం కోసం ఈ ప్రాంగణం పనిచేస్తుందని, అమరావతిలోనూ విశాలమైన స్థలంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌కు సన్నిహితుడె%న హాస్యనటుడు ఆలీ ఆయనకు తెలుగులో ఉన్న ఖురాన్‌ను బహూకరించారు. జనసేన ముఖ్య నేతలు, పవన్ అభిమానులు, సన్నిహితులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## డిసెంబర్ నాటికి ఎయిమ్స్ మొదటి దశ పూర్తికి కృషి

ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎయిమ్స్) నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కోన శశిధర్‌తో కలిసి ఆర్ అండ్ బి., విద్యుత్, అటవీ శాఖ, వాటర్ సప్లయ్ తదితర శాఖల అధికారులతో కలిసి సమీక్షించారు. నిర్మాణ పనులపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మొదటి దశలో ఓపి మరియు రెసిడెన్స్ భవన నిర్మాణ పనులు , రెండవ దశలో ఆసుపత్రి మరియు వైద్య కళాశాలల భవన నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రెండవ దశ నిర్మాణానికి సంబంధించి నవంబర్ మాసానికి టెండర్స్ ప్రక్రియ పూర్తి కానున్నట్లు మంత్రి తెలిపారు. మూడవ దశలో ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరించారు. ఎయిమ్స్ నిర్మాణ ప్రదేశంలో వున్న ఎస్‌డిఆర్‌ఎఫ్ కార్యాలయాన్ని ఆరు నెలల్లో వేరే ప్రదేశానికి తరలించేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఎయిమ్స్ అడ్మిషన్స్ 2018లో చేపట్టుటకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని మంత్రి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి కె. రామ్‌మోహన్ రావు, ఆర్ అండ్ బి ఎస్‌ఇ మాధవి సుకన్య, విద్యుత్ శాఖ ఎస్‌ఇ జయభారత్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రమేష్ కుమార్, ఆర్‌డిఓ శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్, విద్యుత్ డిస్కం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జ్వరాలపై మళ్లీ అదే సమాధానం!

చుట్టూ తిరుగుతున్నారో.. జిల్లాలో ప్రజలు జ్వరాలపై చేసిన ఖర్చు.. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు వెచ్చించే మొత్తంతో సమానంగా ఉంది. ఇంకా రెండు నెలలు జ్వరాల తీవ్రత ఉంటుంది. ఇప్పటికైనా మేల్కొంటారా?... ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం వెలిబుచ్చిన ఆవేదన ఇది.

జ్వరాల నియంత్రణపైనే..

జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రధాన అజెండాగా జిల్లాలో తీవ్రంగా ఉన్న జ్వరాలపైనే చర్చించారు. వైద్య, ఆరోగ్య శాఖ.. పంచాయతీరాజ్.. గ్రామీణ నీటి సరఫరా విభాగం.. మలేరియా శాఖ అధికారులను సమన్వయం చేసి సమస్యను కొలిక్కి తీసుకురావటానికి ఒకేసారి సంబంధిత శాఖల అధికారులను వేదికపైకి పిలిచారు. అక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరే గళం విప్పారు. ప్రతి మండలంలో మృతులు ఉన్నారని చెబుతున్నా.. వైద్య శాఖ లెక్కల్లో మాత్రం జ్వరాలతో ఒక్కరూ మృతి చెందనట్లే ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా రక్త నమూనాల పరీక్షించే బాధ్యతను మెడాల్ సంస్థకు అప్పగించారు. వాళ్లు కనీసం 48 గంటల తర్వాత నివేదికలు ఇస్తున్నారని.. దీనివల్ల అప్పటికే ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి మరణిస్తున్నారని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఆలోచన చేస్తుందని మంత్రి సమాధానం చెప్పారు. ప్లేట్‌లెట్స్‌ను అందుబాటులోకి తీసుకురావటానికి ఎలా చేయాలనే విషయమై చర్చ జరిగింది. ఇప్పటి వరకు ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఒక్కచోటే ప్లేట్‌లెట్స్‌ను వేరు చేసే యంత్రం ఉందని.. జిల్లాలో కేవలం మూడు చోట్ల మాత్రమే ఉన్నాయని వైద్య శాఖ అధికారులు సమాధానం చెప్పారు. కనీసం 20 యంత్రాలు అవసరమని వైద్య శాఖ చెప్పటంతో.. అందుకు నిధులను ప్రభుత్వం తరపునే అందించే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి సోమిరెడ్డి చెప్పారు. ఇదే సమయంలో పంచాయతీల్లో పారిశు ద్ధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడానికి 14వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య పనుల కోసం రూ.37.35 కోట్ల మొత్తం విడుదలయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి శ్రీహరి చెప్పారు. గ్రామాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించటానికి ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారిగా నియమించిన వాళ్లు కృషి చేయాలని.. జ్వరాలు ఎక్కడ తీవ్రంగా ఉన్నా వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టడంలో ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని మంత్రి సూచించారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

29న జిల్లాస్థాయి

## తెలుగుభాష ప్రోత్సాహక పోటీలు

ఒంగోలు : తెలుగు భాషను ప్రోత్సహించే క్రమంలో కళామిత్ర మండలి సారథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఒంగోలు లాయరుపేటలోని రాఘవ డిగ్రీ కళాశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన మహనీయులు అన్న అంశంపై వ్యాసరచన పోటీలు, 11 గంటలకు తెలుగు కవులు-రచయితలు రాసిన కావ్యాలు పొందిన బిరుదులు అన్న అంశంపై క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తిగలవారు 28వతేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 93979 07776లో సంప్రదించాలన్నారు.

## అండర్-19 అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక



ఒంగోలు : జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-19 అథ్లెటిక్స్ బాల బాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఒంగోలు ఏబీఎం కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఈ ఎంపికలో అండర్-19 విభాగ కార్యదర్శి కె.భాస్కరరావు, ఇతర పీడీలు ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ఫత్తేఖాన్‌పేట : స్వదేశీ పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గత యూపీఏ ప్రభుత్వం అవలంభించిన పెట్టుబడిదారి, కార్పొరేట్ అనుకూల విధానాలనే మరింత వేగంగా అమలు చేస్తున్నారని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు దామా అంకయ్య, ఎం.మోహన్‌రావు తెలిపారు. సంతపేట సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానాటికి పెరుగుతున్న ధరల నియంత్రణ వూసే లేదన్నారు.

పోరాడి సాధించుకున్న కొద్ది పాటి హక్కులను హరించే కార్మిక వ్యతిరేక సంస్కరణలు వస్తున్నాయని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు రూ.కోట్లు రాయితీలు కుమ్మరిస్తూ.. కార్మికులకు కనీస వేతనాలు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పది కేంద్ర కార్మిక సంఘాలు నవంబరు 9, 10, 11 తేదీల్లో న్యూఢిల్లీలో మహాపడావ్ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చాయని తెలిపారు.

అధిక సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు కె.ఆంజనేయులు, జి.నాగేశ్వరరావు, చిన్ని రాజగోపాల్, కె.పెంచల నరసయ్య, సీఎస్‌సాగర్, ఎస్‌కే కరిముల్లా, బి.కృష్ణయ్య పాల్గొన్నారు.

## వృత్తిపరమైన నైపుణ్యాలతో మెరుగైన ఫలితాలు

**జేడీ కృష్ణారెడ్డి**

ఒంగోలు : మండల విద్యాశాఖ అధికారులు క్రమశిక్షణతో మెలుగుతూ వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు కృష్ణారెడ్డి ఉద్బోధించారు. ఒంగోలు మంగమూరు రోడ్డులోని రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్ కేంద్రంలో ఎంఈవోలకు రాష్ట్ర స్థాయి శిక్షణ ప్రారంభమైంది. కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం మాట్లాడుతూ పాఠశాల విద్యా ప్రమాణాల పెంపు విషయంలో ఎంఈవోలదే కీలక బాధ్యతని, బోధనాపరమైన అంశాలతోపాటు పరిపాలనాపరమైన అంశాలపైనా పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థుల్లో సామర్థ్యం పెంచేలా విలువలతో కూడిన విద్యా బోధన జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే క్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం డిజిటల్ ప్రొజెక్టర్‌ను ఉపయోగిస్తూ సలహాలు, సూచనలు చేశారు.

డీఈవో విజయభాస్కర్ మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి మొత్తం 119 మంది ఎంఈవోలు హాజరయ్యారని, అయిదు రోజులపాటు జరగనున్న సదస్సును అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శిక్షణలో భాగంగా ప్రతిరోజు తెల్లవారుజామున ధ్యానం, ఆధ్యాత్మిక, యోగా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు కర్నూలు పాలి టెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు రాఘవరెడ్డి, చీమకుర్తి ఎంఈవో కిషోర్, డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావులు సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.

## నా మద్దతు తెదేపాకే

### ఎంపీ బుట్టా రేణుక



ఆలూరు : అధికారికంగా పార్టీలో చేరకపోయినా నా మద్దతు ఎప్పుడు తెదేపాకే ఉంటుందని కర్నూలు పార్లమెంటు సభ్యురాలు బుట్టా రేణుక అన్నారు. ఆలూరులోని తెదేపా కార్యాలయంలో నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడ్‌తో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి పార్టీకి మద్దతు తెలపాలని నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. పార్టీలో ఎందుకు చేరలేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2019 వరకు ఆగండి అని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రగతికి చంద్రబాబునాయుడు అహర్నిశలు పాటు పడుతున్నారని కొనియాడారు. ఆయనతో పాటు అందరూ కలసి కట్టుగా పని చేస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోనే వెనుకబడ్డ ఆలూరు నియోజకవర్గంలోని రైతులు కేవలం వర్షాధారంపైనే పంటలు పండించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సాగు నీటి వనరులు లేకపోవడంతో సకాలంలో వర్షాలు కురవక పంటలు పండక తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేదవతి, నగరడోణ జలాశయాలు పూర్తి అయితే నీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందన్నారు. వేదవతి నదిపై జలాశయ నిర్మాణం పూర్తి కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. వెంటనే జలాశయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విన్నవిస్తానని చెప్పారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు పండించిన పంటలు చేతికందని పరిస్థితి నెలకొందని వివరించారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి ముఖ్య మంత్రికి పరిహారం కోసం నివేదిక అందజేయడం జరుగుతుందని చెప్పారు.

అంతకుముందు తెదేపాకు మద్దతు తెలిపిన తర్వాత మొదటి సారిగా ఆలూరుకు వచ్చిన ఎంపీకి నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్య కర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జడ్పీ టీసీ సభ్యుడు రాంభీంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రాంనాథ్ యాదవ్, నాయకులు నారాయణ రెడ్డి, శివప్రసాద్‌శెట్టి, నర్సప్ప, రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్ తది తరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన కోడిగుడ్లు



కొండాపురం : చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారానికి మూడురోజులు కోడిగుడ్లు వేయాలని, తద్వారా వారికి పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో చూస్తే అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. సాయిపేట పంచాయతీలోని అంగనవాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు వచ్చాయి. అక్కడి నిర్వాహకురాలు ఏజెన్సీ చిమటా వరమ్మ ఆ గుడ్లను విద్యార్థులకు వేసేందుకు ఉడికించడంతో అవి కుళ్లిపోయి వాసన వచ్చాయి. వాటిని కొండాపురం విద్యావనరుల కేంద్రానికి తీసుకొచ్చి ఎంఈవో కె.రవికుమార్‌కు విషయాన్ని వివరించారు. కోడిగుడ్లు సరఫరా చేసే ఏజెన్సీ నిర్వాహకులు ఈ విధంగా తమకు గుడ్లు పంపిస్తే వాటిని ఉడికించి విద్యార్థులకు అందజేస్తే విద్యార్థుల తల్లి దండ్రులు తమపై గొడవకు దిగుతున్నారని వరమ్మ ఎంఈవోకు తెలిపారు. వీటిని తింటే చిన్నారులు అనారోగ్యం పాలవు తారన్నారు. విషయాన్ని తెలుసు కున్న ఎంఈవో ఉన్నతాధికారులతో మాట్లాడి ఆ ఏజెన్సీ వారితో మాట్లాడి నాణ్యమైన గుడ్లు వచ్చేలా చూస్తామన్నారు. అంగన్ వాడీ ప్రాజెక్టు అధికారులు గుడ్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుని నాణ్యమైన వాటిని చిన్నారులకు అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## నేలపట్టుకు విచ్చేసిన గూడబాతులు

దొరవారిసత్రం : మండలంలోని నేలపట్టు పక్షుల రక్షితకేంద్రానికి గూడ బాతులు వచ్చాయి. గత నాలుగు రోజులుగా శీతల ప్రాంత దేశాల నుంచి సుమారు 500కుపైగా గూడబాతులు నేలపట్టులోని చెరువులో ఉన్న కపడచెట్లపైకి వలస వచ్చాయి. గతేడాది వర్షాలు లేక చెరువుకు నీరు రాకపోవడంతో గూడబాతుల జాడ కనిపించలేదు. ఇటీవల ఓ మోస్తరు వర్షాలు పడడంతో చెరువులోకి కొంత నీరు వచ్చి చేరింది. దీంతో గూడ బాతులు, నత్తగుల్లకొంగలు, తెల్ల కంకణాయిలు, నీటి కాకులు సుమారు 2 వేల వరకు ఇక్కడకు వలసవచ్చి చెరువులోని కడప, తుమ్మ చెట్లపై ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి.

## రబీలో శనగ, జొన్న, ధనియాల సాగు అవకాశం

ఆదోని : అధిక వర్షాల ప్రభావంతో పత్తి పంటలో దిగుబడులు 50 శాతం మేర తగ్గడానికి అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నరసింహులు తెలిపారు. ఆదోని మండలం కపటి, అరేకల్లు, దొడ్డనగేరి, పెద్దకడబూరు మండలం చిన్నకడబూరు, రంగాపురం, మేకడోణ, నేమలికల్లు తదితర గ్రామాల్లో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నరసింహులు, ఆదోని వ్యవసాయ అధికారి పాపిరెడ్డి, ఏఈవో నారాయణసింగ్‌లు పత్తి, వేరుసెనగ, మిరప, కూరగాయల పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. సస్యరక్షణ పద్ధతులు తెలియజేశారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన శాస్త్రవేత్త నరసింహులు మాట్లాడారు. పత్తి పంటకు సంబంధించి ఎకరాకు వర్షాధారం కింద 5 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని, నీటి ఆధారం కింద 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అతివృష్టి పరిస్థితుల ప్రభావంతో 40నుంచి 50 శాతం వరకు దిగుబడులు తగ్గుతాయన్నారు. రబీలో నవంబర్ మొదటి వారం వరకు శనగ, జొన్న, మొక్క జొన్న, దనియాలు, ప్రొద్దుతిరుగుడు పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. నీటి ఆధారం కింద కూరగాయల పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. వాతవారణ పరిస్థితులు అనుకులంగా ఉన్నాయని, గులాబి రంగు పురుగు ఉద్ధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకుని, వేపనూనె మందులు పిచికారీ చేయాలన్నారు. పత్తిలో కాయకుళ్లు, బూజు తెగుళ్లు ఆశించిందని నివారణకు పురుగు మందులతో పాటు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాముల లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. వర్షాలు ఎక్కువ కావడం వల్ల పోషక లోపాలు తగ్గాయన్నారు. నత్రజని, మెగ్నీషియం లోపం కనిపిస్తుందన్నారు. 20 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్‌కు నేలకు వేసుకోవాలని సూచించారు. 19,19,19 కూడా పిచికారీ చేసుకుంటే బాగుంటుందన్నారు.

## ప్రజల సమస్యలు తీర్చడమే లక్ష్యం

ఆదోని : పట్టణంలో వివిధ వార్డులలో మంగళవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విస్తృతగా పర్యటించారు. ముందుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో రహదారి, మురుగు కాల్వల సమస్యలపై పురపాలక సంఘం కమిషనర్ రామలింగేశ్వర్‌తో చర్చించారు. చేయాల్సిన పనులు.. నిలిచిన పనులను ప్రత్యక్షంగా చూసి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. అరుణ్‌జ్యోతినగర్‌లో పారిశుద్ధ్య సమస్యలతో పాటు టీజీఎల్ కాలనీలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. ఆకాశవంతెన కూడలి ప్రాంతంలో మురుగు నీటి కాల్వ లైనింగ్ పనుల జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు తీర్చడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, అనంతరం పట్టణ అభివృద్ధికి పనిచేయడమే తమ నైజమన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా అంతిమంగా ప్రజల సమస్యలు తీర్చడమే ప్రధాన ఎజెండా పెట్టుకుని ముందుకెళ్తున్నామన్నారు. ఎం.ఈ విశ్వనాథ్, పారిశుద్ధ్య మేస్త్రీలు, గుత్తేదారులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, బాధ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భరోసాతోనే గ్రానైట్ పరిశ్రమలకు మనుగడ

ఒంగోలు : కుటీర పరిశ్రమగా ఎదిగిన చిన్నతరహా గ్రానైట్ యూనిట్ల అభివృద్ధికి ప్రభుత్వం తగిన భరోసా ఇవ్వాలని రాష్ట్ర చిన్నతరహా గ్రానైట్ కర్మాగారాల సంఘం అధ్యక్షుడు ఎర్రంనేని కోటేశ్వరరావు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రికి మార్టూరులో జరిగిన బహిరంగ సభలో గ్రానైట్ కర్మాగారాల సమస్యలను వివరించారు. గ్రానైట్ రంగంలో లక్షలాది మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవిస్తున్నారని, చిన్నతరహా ఉత్పత్తులను విదేశాల్లో మార్కెట్ చేయడానికి తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని లోకేష్‌ను కోరారు. జిల్లాలో చిన్నతరహా గ్రానైట్ అభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని, జీఎస్టీలో గ్రానైట్‌న అయిదో శ్లాబులో చేర్చేలా చూడాలని, క్వారీలకు ఈసీల పరంగా ఉన్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. మార్టూరు, గుండ్లాపల్లి, ఒంగోలు ఎస్టేట్, ఎండ్లూరు డొంక, చీమకుర్తి బూదవాడలో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

## పోలీసు శాఖలో దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

నెల్లూరు : అమాయక ప్రజలను వారి అవసరాల దృష్ట్యా మభ్య పెట్టి దళారీవ్యవస్థ ద్వారా మోసగిస్తున్న పోలీసు అధికారులపై గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తరచూ పోలీసు స్టేషన్లకు వస్తూ పైరవీలు చేసే ప్రక్రియకు ఇక ఫుల్‌స్టాప్ పెట్టాలని, అటువంటి చర్యలకు ఉపేక్షించేది లేదని, అటువంటి వారిని ప్రోత్సహించిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తప్పవని సూచించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా ఆయా ప్రాంత స్టేషన్లకుగానీ, సర్కిల్ కార్యాలయాలకు, సబ్ డివిజనల్ కార్యాలయాలకుగానీ వెళ్లి సమస్యలను వివరించాలన్నారు. దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్న పోలీసులు, దళారుల వివరాలు వాట్సప్ నంబరు 93907 77727కు తెలియజేయాలని కోరారు.

## ఉద్యమాలతో హక్కుల సాధన

### పార్లమెంటు వద్ద నవంబరు 9న మహా ధర్నా

ఒంగోలు : కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా నవంబరు 9 నుంచి 11 వరకూ దిల్లీలో చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్డీ సర్దార్ కోరారు. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి రౌండ్‌టేబుల్ సమావేశం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఎస్‌డీ సర్దార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలను అరికట్టాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రికం చేయాలని, నిరుద్యోగాన్ని రూపుమాపాలని, అంగీకృత ప్రమాణాలతో అందరికీ ఉద్యోగాలు కల్పించాలన్నారు. కార్మిక చట్టాల అమలు, ప్రతి ఒక్కరికి సామాజిక భద్రత, నెలకు రూ. 18వేలు తగ్గకుండా కనీస వేతనం, కనీస పింఛను రూ. మూడువేలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవటీకరణ ప్రక్రియను నిలుపుదల చేయడం, సీపీఎస్ విధానం రద్దు, ఒప్పంద పనులు పూర్తిగా నిలిపి వేయాలని, ఒప్పంద కార్మికులకు సమాన వేతనం, ప్రయోజనాలన్న డిమాండ్లతో ఈ ధర్నా చేపట్టామన్నారు. అన్ని సంఘాలు సమాయత్తం కావాలని, కార్మికుల పిడికిళ్లు బిగించి ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సీహెచ్ మజుందర్, జి.శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పీవీఆర్‌చౌదరి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రామస్వామి, ఎన్.వీరాస్వామిరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్, సీహెచ్ రంగారావు తదితర ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పల్లెపిలుపులో అధికారులకు నిరసన సెగ

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో బీసీ, ఎస్సీ మైనారిటీ కాలనీలకు తాగునీరు సరఫరా కావటం లేదని ప్రజలు అధికారులను నిలదీశారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో పల్లెపిలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు.మండల ప్రత్యేక అధికారి వీరారెడ్డి, మండల స్థాయి అధికారులతో పురవీధుల గుండా పర్యటించి సమస్యలపై ఆరా తీస్తుండగా ఆయా కాలనీల ప్రజలు ఒక్కసారిగా అధికారులపై విరుచుకుపడ్డారు.ఈ విషయంపై ప్రత్యేకాధికారి ఆర్ డబ్ల్యూఎస్ ఏఈని వివరణ కోరగా పల్లెపిలుపు కార్యక్రమానికి అందుబాటులో లేరు. దీంతో అసహనానికి గురైన ప్రత్యేకాధికారి సమయపాలన పాటించని అధికారులపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయాలని విజయలక్ష్మిని ఆదేశించారు.

## 18ఏళ్లు నిండినవారందరికీ జాబితాలో చోటు

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్



నెల్లూరు : రానున్న 2019 సాధారణ ఎన్నికల్లో భాగంగా 18 సంవత్సరాలు నిండిన వారందరిని ఓటర్ల జాబితాలో చేర్చాలని,శాశ్వత వలసదారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ సూచించారు. ఇందుకోసం నవంబరు 1 నుంచి 20 రోజులపాటు ఇంటింటి సర్వేని ట్యాబ్‌లతో కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం నెల్లూరు వచ్చిన ఆయన నగరంలోని పినాకిని అతిథిగృహంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు కలెక్టరు ముత్యాలరాజు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి ఆయనతో కొద్దిసేపు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. జిల్లా వృద్ధి, అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ఇతర వివరాలను ఆయనకు తెలియజేశారు. నెల్లూరు, గూడూరు, కావలి, ఆత్మకూరు తదితర డివిజన్‌ల మ్యాప్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిలిమిటేషన్ ఉత్తర్వులను అనుసరించి కార్పొరేషన్ పరిధిలో వార్డుల హద్దులను కచ్చితంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సర్వీసు ఓటర్లను 100 శాతం పూర్తిచేసేలా చూడాలని, అలాగే ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులను నెల రోజుల్లోపు విధిగా పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఇంటింటి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో నూరు శాతం విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావు, డీఆర్‌వో వెంకటసుబ్బయ్య, ఆర్డీవోలు హరిత, భక్తవత్సలరెడ్డి, అరుణ్‌బాబు, శీనానాయకర్, బాపిరెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణం ఐఏబీ సమావేశం నిర్వహించండి: రైతు సంఘం నాయకులు

నెల్లూరు : జిల్లా రైతులకు నీటి విడుదలపై సాగునీటి సలహామండలి సమావేశం తక్షణం ఏర్పాటు చేయాలి.. నవంబరులో ఐఏబీ నిర్వహిస్తే నీటి విడుదలలో తీవ్ర జాప్యమవుతుందని నెల్లూరు జిల్లా రైతు సంక్షేమ సంఘం నాయకులు నీటిపారుదల శాఖ ఇంజినీర్లను కలిసి వినతి పత్రం అందచేశారు. దీనిపై మంత్రి సోమిరెడ్డి స్పష్టత ఇవ్వాలని ఇప్పటికే సోమశిలకు 50టీఎంసీల నీరు చేరి 20రోజులు దాటినా నీటి విడుదలపై రాజకీయ నాయకులలో సఖ్యత లేకపోడంతో పంటలు వేసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నీటి విడుదలపై జిల్లా కలెక్టర్ బాధ్యత వహించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కాలువలలో పూడికపనులు ఎక్కడా పూర్తి స్థాయిలో జరగడం లేదని వెల్లడించారు. నీటిపారుదల శాఖ సీఈ ఆదేశాలతో సోమశిల నీటిని ఏవిధంగా కండలేరుకు తరలిస్తారని ఆయనకు నీటి తరలింపుపై ఎటువంటి హక్కులు లేవని పేర్కొన్నారు. జిల్లా రైతులకు నీరు ఇవ్వకుండా కండలేరుకు నీటిపారుదల శాఖ అధికారులు అక్రమంగా నీటిని తరలించడంపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఐఏబీ సమావేశం ఆలస్యంగా నిర్వహించడంతో రైతులకు నీరు నవంబరు 15 తరువాత విడుదల అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు బెజవాడ గోవిందరెడ్డి, నాగార్జున రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## కోర్టు తీర్పుల అనూహ్యం

సమాజంలో అంతర్భాగమైన కోర్టులు సామాజిక స్థితి గతులకు అతీతమైనవి కావని చరిత్ర చెబుతున్నది. రాజ్యాంగస్ఫూర్తితో రూపొందించుకున్న చట్టాల వెలుగులో కోర్టులు తీర్పులను వెలువరిస్తాయి. అయితే ఆ తీర్పులపై సామాజిక పరిస్థితుల ప్రభావం అనివార్యంగా ఉంటుందనటంలో సందేహం లేదు. ఒక్కో సందర్భంలో సామాజిక సమూహాల ఆకాంక్షలను ప్రతిఫలించేవిగా తీర్పులుండటం సహజమే. సినిమా హాళ్లలో జాతీయ గీతాలాపన సమయంలో దేశభక్తికి సూచికగా ప్రేక్షకులందరూ లేచి నిలబడాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొ నటం ఆహ్వానించదగినదే కాదు, ఆచరణాత్మకమైనది. ఈ సందర్భంగా కోర్టు వెలిబుచ్చిన అభిప్రాయాలు గమనార్హమైనవి. దేశభక్తి విషయంలో కోర్టులతో చెప్పించి కేంద్రం తాను అనుకున్న లక్ష్యాలను సాధించాలనుకోవటం తుపాకీని తమ భుజాలపై పెట్టి కాల్చడంగా అభివర్ణిస్తూ, అలాంటి చర్యను అనుమతించబోమని ప్రకటించింది. మోరల్ పోలీసింగ్ చేయబోమని తేల్చి చెప్పింది. అంతేకాదు ప్రజలను తమ భుజాలపై దేశభక్తిని మోయాలని ఆదేశించజాలమని కూడా తేటతెల్లం చేయటం కోర్టు భావనలో వచ్చిన మార్పును సూచిస్తున్నది. నిజానికి ప్రస్తుత తీర్పును ప్రకటించిన జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోనే గతంలో జాతీయ గీతాలాపన సమయంలో ప్రేక్షకులందరూ తప్పనిసరిగా లేచి నిలబడాలన్న తీర్పు వచ్చింది. ఈ తీర్పు గత ఏడాది డిసెంబర్ 1న వచ్చిన సందర్భంగానే దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందులతో పాటు, ఆధిపత్య భావజాల ప్రభావంతో వచ్చిన తీర్పుగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా వికృత పరిణామాలు ఏర్పడ్డాయి. హిందూ మెజారిటీవాదం పెట్రేగిపోయి అనేక రూపాల్లో ప్రజలను శాసించటం మొదలెట్టింది. ఈ నేపథ్యంలోంచే ప్రతి ఒక్కరూ తమ జాతీయతను, దేశభక్తిని నిరూపించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలాంటి సామాజిక వాతావరణంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. సుప్రీంకోర్టు గత ఏడాది ఇచ్చిన తీర్పును ప్రజల్లో జాతీయతను పాదుకొల్పేందుకు అవసరమైన చర్యగా అభివర్ణించింది. అన్ని పాఠశాలల్లో విధిగా జాతీయ గీతాలాపన చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలోంచే సినిమాహాళ్లలోనూ జాతీయగీతం ఆలపించాలని, గీతం వచ్చేటప్పుడు సినిమా హాలులోని స్క్రీన్‌పై జాతీయ జెం డా చూపాలని తెలిపింది. కోర్టు ఉద్దేశాన్ని తప్పుపట్టాల్సిందేమీ లేకున్నా ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందుల గురించే నాడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ సాగింది. అందరూ ఊహించినట్లుగానే దేశవ్యాప్తంగా అనేక ఘటనలు జరిగాయి. చెన్నై అశోక్‌నగర్‌లోని కాశీ థియేటర్‌లో జాతీయ గీతం వచ్చేటప్పుడు ఇద్దరు యువతులు, ఆరుగురు యువకు లు లేచి నిల్చోలేదని పెద్ద గొడవ జరిగింది. నిలబడని వారిపై జాతీయగీతాన్ని అగౌరపర్చారని కేసు నమోదైంది. అలాగే కేరళలో అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ సందర్భంగా 48 గంటల్లోనే 20 కేసులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోనైతే జాతీయ గీతం ఆలపించటం లేదని మదర్సాలపై జాతీయ భద్రతా చట్టం ప్రయోగించాలన్న వాదన బయలు దేరింది. ఇలాంటి ఆచరణాత్మక ఇబ్బందులతోపా టు దేశంలో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితులు సుప్రీంకోర్టు తాజా తీర్పునకు హేతువులుగా భావించాల్సి ఉన్నది. మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో మునుపెన్నడూ లేని విధంగా సామాజికంగా అనేక విపరిణామాలు చోటుచేసుకున్నాయి. అసహన రాజకీయాలు పెట్రేగిపోయాయి. తినే తిండి, కట్టే బట్ట, జీవితాచరణపై అనేక రూపాల్లో నియంత్రణ కొనసాగుతున్నది. గోరక్షకుల పేర కొందరి ఆగడాల కు అంతులేకుండా పోతున్నది. గోమాంసాన్ని ఇంట్లో దాచుకున్నాడన్న నెపంతో అఖ్లాక్ హత్యా ఉదంతం చోటు చేసుకున్నది. లవ్ జిహాద్‌లు, ఘర్‌వాపసీ పేరిట ఏకశిలా సదృశ జాతి సంస్కృతిని నెలకొల్పే దిశగా దుశ్చర్యలు సాగుతున్నాయి. గోరక్షణ పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవటం సహించబోమని ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించాల్సి వచ్చిందంటే దేశంలో పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిందే. సమాజంలో అంతర్భాగమైన కోర్టులు సామాజిక స్థితి గతులకు అతీతమైనవి కావని చరిత్ర చెబుతున్నది. రాజ్యాంగ స్ఫూర్తితో రూపొందించుకున్న చట్టాల వెలుగులో కోర్టులు తీర్పులను వెలువరిస్తాయి. అయితే ఆ తీర్పులపై సామాజిక పరిస్థితుల ప్రభావం అనివార్యంగా ఉంటుందనటంలో సందేహం లేదు.

# అమెరికా కంటే మా రోడ్లే బాగున్నాయి

## మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్



వాషింగ్టన్: అమెరికా కంటే మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రోడ్లే చాలా బాగుంటాయని అంటున్నారు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. శివరాజ్ ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన అక్కడ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. వాష్టింగన్ ఎయిర్‌పోర్ట్‌లో దిగి రోడ్డుపై ప్రయాణించాక ఇక్కడ కంటే తన రాష్ట్రంలోని రోడ్లే బాగున్నాయని అనిపించిందని పేర్కొన్నారు.

పైగా ఇదేదో వూరికే సరదాగా చెప్పడానికి అనడంలేదని తెలిపారు. మధ్యప్రదేశ్‌లో 1.75 లక్షల కిలోమీటర్ల మేర రోడ్లు వేయించామని రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోనూ మెరుగైన రోడ్లు వేయించామని పేర్కొన్నారు. అమెరికాలో 65.8 లక్షల కిలోమీటర్ల మేర రోడ్ నెటవర్క్ ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద రోడ్ నెటవర్క్ కలిగున్న దేశంగా అమెరికాకు రికార్డు ఉంది.

అలాంటి దేశంలో శివరాజ్ మధ్యప్రదేశ్ రోడ్ల గురించి మాట్లాడటంతోవిపక్షాలు ఆయనపై కామెంట్లు గుప్పిస్తున్నాయి.

మధ్యప్రదేశ్ రాష్ట్రం మొత్తంలో అడుగడుగునా రోడ్లపై గుంతలు ఉన్నాయని ఇక్కడి రోడ్ల గురించి అమెరికా వంటి అగ్రరాజ్యంతో పోల్చడమేంటని విపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి.

# విశాల్‌కు ఆదాయపు పన్ను శాఖ సమన్లు



చెన్నై: తమిళ నటుడు విశాల్‌కు ఆదాయపు పన్ను శాఖ అధికారులు సమన్లు జారీచేశారు. 27వ తేదీన తమ కార్యాలయంలో హాజరుకావాలని ఆదేశించారు. చెన్నై, వడపళనిలోని విశాల్ కార్యాలయంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. తనిఖీల్లో విశాల్ రూ. 51 లక్షల పన్ను చెల్లించలేదని తెలిసినట్టు సమాచారం. విశాల్ కార్యాలయం నుంచి కొన్ని కీలక ఆధారాలను ఆదాయపు పన్ను శాఖ అధికారులు తీసుకెళ్లినట్లు తెలిసింది. దీనిపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు స్పందిస్తూ విశాల్ మెర్సల్ చిత్రానికి మద్దతు తెలపడం, చిత్రాన్ని ఇంటర్నెట్‌లో చూసిన బీజేపీ జాతీయ కార్యదర్శి హెచ్.రాజాను తప్పుపట్టడం వల్లే ఆయన కార్యాలయంపై దాడులు జరిగాయంటున్నారు.

నటుడు విశాల్ మాత్రం తన ఆదాయానికి సంబంధించిన లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయన్నారు. ఒకవేళ తనపై కక్ష సాధింపుచర్యలకు పాల్పడితే తగువిధంగా ఎదుర్కొంటానని ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో చాలా ముఖ్యమైన సమస్యలున్నాయని, వాటిపై దృష్టిపెట్టాలని ప్రతిఒక్కరికి సూచించారు.

# హనీప్రీత్‌ను వదిలేయండి... బీజేపీ ఎమ్మెల్యే డిమాండ్!



న్యూఢిల్లీ: డేరాబాబా కేసు, పంచకుల అల్లర్లపై హర్యానా బీజేపీ ఎమ్మెల్యే కుల్వంత్ బాజీగార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పంచకుల అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జైల్లో ఉన్న డేరాబాబా శిష్యురాలు, వివాదాస్పద దత్తపుత్రిక హనీప్రీత్ సింగ్‌ను కూడా ఆయన వెనకేసుకొచ్చారు. హనీప్రీత్ సహా పంచకుల అల్లర్ల కేసులో అరెస్టైన డేరాబాబా అనుచరులందర్నీ వెంటనే విడుదల చేయాలని కోరారు. వాళ్లంతా అమాయకులు.. బూటకపు కేసులు బనాయించి వారిని అరెస్టు చేశారు... అని ఎమ్మెల్యే కుల్వంత్ వ్యాఖ్యానించారు. కాగా ఆయనకు మరో స్వతంత్ర ఎమ్మెల్యే జైప్రకాశ్ మద్దతుగా నిలవడం విశేషం. బాబా రామ్‌పాల్, డేరాచీఫ్ గుర్మీత్ సింగ్ తదితరులపై కేసులు వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఈ అంశం కోర్టు పరిధిలో ఉందనీ... దీనిపై ఎవరూ ఏమీ మాట్లాడడానికి లేదని ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొన్నారు.

ఇద్దరు సాధ్వీలపై అత్యాచారానికి పాల్పడిన కేసుల్లో డేరాబాబాకి 20 యేళ్ల జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే. ఆగస్టు 25న పంచకుల సీబీఐ కోర్టు డేరాబాబాను దోషిగా తేలుస్తూ తీర్పు చెప్పిన కొద్ది సేపటికే.. పంచకులలో భారీ ఎత్తున అల్లర్లు చెలరేగాయి. 42 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. దాదాపు రూ. 200 కోట్లకు పైగా ప్రభుత్వ ఆస్తులు నష్టం వాటిల్లింది.

ఈ అల్లర్ల వెనుక డేరాబాబా వివాదాస్పద దత్తపుత్రిక హనీప్రీత్ సహా పలువురు డేరా నిర్వాహకుల హస్తం ఉందంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. నెలరోజుల పాటు తప్పించుకు తిరిగిన హనీప్రీత్ సహా వీరందర్నీ అరెస్టు చేసి జైలుకు తరలించారు.

# ఇలాగైతే ఓటేయం... సీఎంకు ఓటర్ల షాక్..!

సోలాన్: అసెంబ్లీ ఎన్నికల వేళ హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్‌కు ఆయన నియోజకవర్గం నుంచే ప్రతిఘటన ఎదురైంది. ఆర్కీ నియోజకవర్గం నుంచి ఆయన ఈసారి పోటీ చేయబోతున్నారు. అయితే ఆయన నియోజకవర్గంలోని రౌరి గ్రామానికి చెందిన ఓటర్లు తమ గ్రామాన్ని సురక్షితమైన, వాతావరణ కాలుష్యం లేని ప్రాంతానికి పెర్మనెంట్‌గా తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికలను బాయ్‌కాట్ చేస్తామని అధికారులు, రాజకీయ పార్టీలకు అల్టిమేటం ఇచ్చారు.

సుమారు 500 మంది గ్రామస్థులు డార్లాఘాట్ ఏరియాలో నివాసం ఉంటున్నారు. ప్రధానంగా వీరు అక్కడికి సమీపంలోని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే శబ్ద, వాతావరణ కాలుష్యంతో సతమతమవుతున్నారు. దుమ్ము, ధూళితో చర్మ, శ్వాససంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఫ్యాక్టరీ శబ్దాలతో రాత్రిపూట నిద్ర ఉండటం లేదని, తమ ఇళ్లు కూడా బీటలు వారిపోతున్నాయని వారు వాపోతున్నారు. అధికార యంత్రాగం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే నవంబర్ 9న జరిగే ఎన్నికలను సామూహికంగా బహిష్కరిస్తామని గ్రామస్థులు హెచ్చరించారు. దీనిపై వీరభద్ర సింగ్ ఎలా స్పందిస్తారనేది చూడాలి.

# కవి సమయం

## 'సెల్లు గోల'

అదే పనిగా వాగుతుంది నా సెల్లు
మాట్లాడేది మాత్రం సొల్లు
వాడతాను టాక్ టైము ఫుల్లు
భారీగా వస్తుంది నెలసరి బిల్లు
దానిని చూస్తే తూలుతుంది ఒళ్ళు
దానిని చూసి ఫ్రెండ్స్ పడతారు కుళ్ళు
పడుతుంది జేబుకు చిల్లు
వదిలేసాను ఉద్యోగం మిల్లు
అందుకే రాబడి మాత్రం నిల్లు
రోజూ నాన్న తీసుకుంటాడు క్లాసు
తిట్లన్నీ ఊర మాసు
ఇవేమి బాధలు దాసూ

... రచయిత
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

# పంచాంగం

మాసం : కార్తీక శు. షష్ఠి, ఉ. 8.51
పూర్వాషాఢ రా. 9.33; ఉ.శే.వ.7.22వ
గురువారం 26-10-2017

**మేషం** : నిరుద్యోగులకు ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తున్న పనులు పునఃప్రారంభించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. వ్యాపారాల్లో నూతన భాగస్వాములను చేర్చుకునే విషయంలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. సాంఘిక, సేవా కార్యాక్రమాలలో చురుకుగా వ్యవహరిస్తారు. ఉద్యోగుల శ్రమకు, నైపుణ్యతకు అధికారుల నుండి ప్రశంసలు లభిస్తాయి.

**వృషభం** : ట్రాన్స్‌పోర్ట్, ఆటోమొబైల్, మెకానికల్ రంగాల వారికి మిశ్రమ ఫలితం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలచోన అవసరం. ప్రయాణాలలో మెళకువ అవసరం. ఫైనాన్సు రంగమందు ఉన్నవారికి చాలా యోగం. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. మొండి బాకీలు కూడా వసూలు అగును. ప్రేమ వ్యవహా రములు పరిష్కారమగును. నిరుద్యోగులకు మంచి జరుగును.

**మిధునం** : ఇతరుల కారణంగా మీ కార్యక్రమాలు వాయిదా పడటంతో కొంత నిరుత్సాహానికి గురవుతారు. విద్యార్థు లకు ఏకాగ్రత చాలా అవసరమని గమనించండి. నూతన పరిచయాలు ఏర్పడు తాయి. మొండి బాకాయిలి వసూలు కాగలవు. అనుకున్న పనులు కొంత ముందు వెనుకలుగనైనా సంతృప్తి కరంగా పూర్తి చేస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చు కుంటారు.

**కర్కాటకం** : స్థిరచరాస్తుల విషయంలో ముఖ్యుల మధ్య విభేదాలు తలెత్తే ఆస్కారం ఉంది, మార్కెటింగ్, ప్రైవేటు సంస్థలలోని వారు అధిక శ్రమ, ఒత్తిడికి గురవుతారు. చేపట్టిన పనులలో కొంత ముందు వెనుకలుగానైనా సంతృప్తి కానరాగలదు.

**సింహం** : గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఊహించని ఖర్చులు, ఇతర్రతా చెల్లింపులు వల్ల చికాకులు తప్పవు. నిరుద్యోగులకు మధ్య వర్తుల పట్ల అప్రమత్త అవసరం. ప్రత్యర్థులు మిత్రులుగా మారి సహాయం అందిస్తారు.దీక్షా పట్టుదలతో అనుకున్న లక్ష్యం సాధిస్తారు. వ్యాపారాల్లో భాగస్వామి సహాయసమకారం లభిస్తుంది.

**కన్య** : స్త్రీలకు చుట్టు పక్కల వారితో సంబంధ బాంధవ్యాలు నెలకొంటాయి. భాగస్వామికుల మధ్య నూతన విషయాలు చర్చకు వస్తాయి. బ్యాంకు పనులు వాయిదాపడుతాయి.ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. ప్రముఖుల కలయికతో ఒక వ్యవహారం సానుకూలం అవు తుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు.

**తుల** : విద్యార్థులకు తమ ధ్యేయం పట్ల ఆసక్తి, శ్రద్ధ పెరుగుతుంది. ప్రయోజనకరమైన విషయాలు చర్చించి సత్ఫలితాలు పొందుతారని చెప్పవచ్చు.

**వృశ్చికం** : ముఖ్యమైన వ్యవహారాలు గోప్యంగా ఉంచండి. స్త్రీలకు సన్ని హితుల నుండి అందిన ఆహ్వానాలు సంతృప్తినిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. గతంలో నిలిపి వేసిన వ్యాపారాలు, పనులు పునఃప్రారంభించటానికి చేయు యత్నాలు కలిసివస్తాయి.


**ధనుస్సు** : వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. రావలసిన ధనం అనుకోకుండా చేతికందును. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల తీరు ఆందోళన కలిగిస్తుంది. సాంఘిక, సేవా కార్యక్రమాలలో చురుకుగా వ్యవహరిస్తారు.

**మకరం** : మాట్లాడలేని చోట మౌనం వహించటం మంచిది. ఉద్యోగస్తుల శ్రమకు, నైపుణ్య తకు అధికారుల నుండి ప్రశంసలు లభిస్తాయి. సొంత వ్యాపారాల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

**కుంభం** : వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందులను ఎదు ర్కుంటారు. స్త్రీలతో సంభాషించేటప్పుడు సంయమనం పాటించండి. విద్యార్థి నులకు ఏకాగ్రత లోపం వల్ల ఆందోళన తప్పదు.. స్థిరచరాస్తుల విషయంలో ముఖ్యుల మధ్య విభేదాలు తలెత్తే ఆస్కారం ఉంది, మార్కెటింగ్, ప్రైవేటు సంస్థలలోని వారు అధిక శ్రమ, ఒత్తిడికి గురవుతారు.

**మీనం** :ఉపాధ్యాయులకు ఒత్తిడి, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికమవుతాయి. గృహంలో మార్పులు, చేర్పులకై ప్రయత్నాలు ఫలిస్తాయి. భూ సంబంధ వ్యవహారము యందు మధ్య వర్తిత్వం జరిపి సమస్యలు పరిష్కారం చేయుదురు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు.

# తెలుగువారి మహావిష్ణువు శ్రీకాకుళేశ్వరస్వామి



## సంకీర్తన

ఆంధ్ర వల్లభుడు... ఆంధ్ర నాయకుడు... ఆంధ్ర మహా విష్ణువు... ఇంకా మరెన్నో పేర్లతో భక్తుల పూజలందు కుంటు న్నాడు శ్రీకాకు ళేశ్వర స్వామి. కలియుగంలో పాపభారం తగ్గించేందుకు ఈ స్వామి ఆవిర్భవించాడని భక్తుల విశ్వాసం. కృష్ణాజిల్లాలోని ఈ క్షేత్రానికి చారిత్రకంగానూ పౌరాణికంగానూ ఎంతో ప్రాధాన్యముంది.శ్రీకాకుళేశ్వరస్వామి... కృష్ణా జిల్లా ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో కొలువై ఉన్నాడు. ప్రసిద్ధి చెందిన 108 పుణ్యక్షేత్రాల్లో ఇది 57వదిగా చెబుతారు. శ్రీకాకుళంలో స్వామివారు స్వయంభువుగా వెలసి పాపాలను హరిస్తున్నాడని భక్తుల నమ్మిక. ఈ శ్రీకాకుళ క్షేత్రం సాక్షాత్తూ బ్రహ్మదేవుని ప్రయత్నం మేరకే ఉద్భవిం చిందని పురాణ కథనం. కలి యుగంలో రోజురోజుకీ పాపాలు పెరిగిపోతున్నాయని దేవత లంతా వ్యాకులత చెందారట. వాళ్లంతా చతుర్ముఖ బ్రహ్మతో సహా భూలోకానికి వచ్చి ఒక ప్రదేశంలో మహావిష్ణువు కోసం తపస్సు ప్రారంభించారు. ఆ తపస్సుకి మెచ్చి మహావిష్ణువు ప్రత్యక్షం కాగా... 'భూలోకంలో ఈ ప్రాంతంలోనే మీరు కొలువై ఉండి భక్తుల పాపాలను హరించాలని' వారు కోరారట. అందుకు నారాయ ణుడు సమ్మతించడంతో చతుర్ముఖ బ్రహ్మ స్వయంగా శ్రీమహా విష్ణువును అక్కడ ప్రతిష్ఠించాడట. బ్రహ్మకు ఆకులమైనందుకు కాకుళమని పేరు వచ్చిందనీ శ్రీహరి ఆచోటనే ప్రతిష్టితు డైనందుకు కాకుళేశ్వరుడిగా కీర్తినొందాడని పురాణ కథనం. ఉపనిషత్తుల ప్రకారం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు వరుసగా సంస్కృత, ఆంధ్ర, ప్రాకృత భాషలు అత్యంత ప్రియమైనవి. ఆంధ్రభాషపై ప్రీతిగల మహావిష్ణువే శ్రీకాకుళంలో కొలువు దీరాడనీ పురాణోక్తి. ప్రాచీనకాలంలో ఇక్కడికి సమీపంలోనున్న నదీమార్గాన వ్యాపారాలు జరుగుతుండేవి. దారినపోయే నావి కులు ఈ ప్రాంతానికి వచ్చి స్వామిని దర్శించుకుని వెళ్లేవారట.

వాళ్లంతా ఈ ప్రాంతాన్ని సిరికొలను, సిరికికొలను అని పిలిచేవారట. అదే కాలక్రమేణా శ్రీకాకుళంగా మారిందని చెబుతారు. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలోనే ఇక్కడ స్వామికి ఆలయం ఉండేదట. ఆపై ఇక్కడి స్వామి అదృశ్యమైపోయాడట. దాదాపు వెయ్యేళ్లపాటు ఎవ్వరికీ కనిపించలేదట. ఆ తరువాత కొన్నాళ్లకి... ఒరిస్సా పాలకుడ్కైన అంగపాలుడి ప్రధానమంత్రి నరసింహవర్మ ఓసారి కాంచీపురానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో కృష్ణా తీరానున్న శ్రీకాకుళానికి వచ్చాడు. ఈ క్షేత్ర మహిమ తెలుసు కుని, అదృశ్యమైన విగ్రహం ఎక్కడుందో కనిపెట్టి పునఃప్రతిష్ట చేయాలని నిర్ణయించుకున్నాడట. దానికోసం ఎన్నో గ్రామాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యాడట. ఓరోజు రాత్రి స్వామి ఆయన కలలో కనిపించి వేమశర్మ అనే బ్రాహ్మణుడి ఇంటి ఆవరణలో ఉన్నా నని చెప్పాడట. వెంటనే నరసింహవర్మ ఆ ప్రాంతానికి వెళ్లి తవ్వ కాలు జరపగా విగ్రహం బయటపడింది. దాన్ని శ్రీకాకుళానికి తీసుకొచ్చి పునఃప్రతిష్టించినట్లు చెబుతారు.



# నాస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయండి

## వీడియో సమావేశంలో ఎస్పీడీ శ్రీనివాస్



చిత్తూరు : జాతీయ స్థాయిలో నిర్వహించే నాస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర పథక సంచాలకులు గుర్రం శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి జిల్లా విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. నవంబరు 13న దేశ వ్యాప్తంగా నేషనల్ అచీవ్‌మెంటు సర్వే (నాస్) పరీక్ష మూడు, ఐదు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు జరుగుతుందన్నారు. ఈ తరగతులకు చెందిన ప్రతి విద్యార్థి ఈ పరీక్షను తప్పనిసరిగా రాసేలా సన్నద్ధం చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు స్వచ్ఛ పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవడవంలో రాష్ట్రం ద్వితీయ స్థానంలో నిలిచిందని, ఈ పర్యాయం జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలని పేర్కొన్నారు. పాఠశాల సముదాయాల్లో ఈ నెల 26నుంచి 31వరకు సీఆర్‌సీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

రాష్ట్ర వ్యాప్తంగా 220 ఉర్దూ మాధ్యమ ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత స్థాయికి పెంచామని, చిత్తూరు జిల్లాలో 22 పాఠశాలల స్థాయి పెరిగిందని గుర్తు చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలను పాఠశాల విద్య కమిషనర్‌కు అందజేయాలని సూచించారు. వనం-మనంలో భాగంగా మొక్కలను విరివిగా నాటాలన్నారు. జిల్లా నుంచి డీఈవో పాండురంగస్వామి, సెక్టోరియల్ అధికారులు ఉమామహేశ్వరరెడ్డి, సుధాకర్, ఆముదవల్లి, శ్రీనివాస్, జయప్రకాష్, జయచంద్ర, మహ్మద్‌ఖాన్, లోకనాథం, యువ రాజుల నాయుడు, లావణ్య, డీఈఈ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్న చిన్న తప్పులకు ఆత్మహత్యలే శరణ్యం కాకూడదు

## సాహస యాత్ర 1200 కిమీ సైకిల్ ర్యాలీ ఆరంభ కార్యక్రమంలో వక్తలు



చిత్తూరు : ప్రతి చిన్న తప్పునకు ఆత్మహత్యలే శరణ్యం కాకూడదు, సాహసమే శ్వాసగా ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని అని వక్తలు పిలుపునిచ్చారు. మహిళల్లో ఆత్మహత్యలను నివారించడానికి, వారికి మేమున్నామంటూ భరోసా కల్పించడానికి అతివల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుదాం అనే నినాదంతో చేపట్టిన 1200కిలోమీటర్ల సైకిల్ యాత్ర జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు జెండా వూపి సాహస యాత్రను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న మాట్లాడుతూ సైకిల్ యాత్రలో పాల్గొంటున్న మహిళా కానిస్టేబుళు భార్గవి, నాగరత్న, తిరుమల, నిర్మలకు అభినందనలు తెలిపారు. ఈ యాత్ర మహిళా లోకానికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. మహిళల్లో ఆత్మస్థైర్యం లేదంటే నేను ఒప్పుకోను. ఆత్మస్థైర్యం లేదని గుంతలు తీసి మళ్లీ దాన్ని పూడ్చడం సరికాదు. మీలోని శక్తి మీరు తెలుసుకోవాలంటూ విజయాలు సాధించిన నారీమణుల గురించి కలెక్టర్ ప్రస్తావించారు. ఆత్మస్థైర్యంతో పాటు ఆత్మగౌరవం కూడా అవసరమని, అందువల్ల ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ సాహస యాత్ర సందర్భంగా ప్రతిఒక్కరికి వ్యక్తిగత మరుగుదొడ్ల ప్రాముఖ్యాన్ని కూడా వివరించాలని మహిళా కానిస్టేబుళ్లకు సూచించారు.

అనంతరం జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ జిల్లా మహిళా పోలీసుల చరిత్రలో ఇదో ముఖ్య ఘట్టంగా అభివర్ణించారు. ప్రభుత్వం ఎన్నో మహిళా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ వారిపై దాడులు, దౌర్జన్యాలు ఆగడం లేదన్నారు. మహిళల్లో చైతన్యం తేవడం, చట్టాలపై అవగాహన కల్పించడం, వారి సమస్యలను ధైర్యంగా బయటకు వచ్చి చెప్పేలా స్ఫూర్తి రగిలించడానికే ఈ యాత్ర చేపట్టినట్లు వివరించారు. అమ్మాయిలు చాలా మంది పరీక్షలో ఫెయిల్ అవడం, ప్రేమలో ఓడిపోవడం, అకతాయి వేధింపులు వంటి చిన్నచిన్న కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనిని అధిగమించాలంటే మార్పునకు ఈ సభ నుంచే అంకురార్పణ జరగాలన్నారు. సైకిల్ యాత్ర జిల్లాలోని గ్రామగ్రామానికి వెళుతుందన్నారు. మండల కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలకు వివిధ అంశాల్లో అవగాహన కల్పిస్తారని వివరించారు. జిల్లా ఏఎస్పీ రాధిక మాట్లాడుతూ సమస్య కన్నా ప్రాణం విలువైనదని తెలిపారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పరిష్కరించడానికి పోలీసులు ఉన్నారని మర్చిపోవద్దని సూచించారు. తమ సమస్యలపై ధైర్యంగా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలన్నారు. చదువుకునే వయసులో అనవసర ఆకర్షణలకు లోనుకాకూడదని చెప్పారు. చిత్తూరు ఎంపీ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం అమ్మాయిల ఆత్మహత్యలు, వారిపై దాడుల పెరిగిపోయిన ప్రస్తుత తరుణంలో మేమున్నామని మీకేం కాదని ధైర్యం చెప్పడానికి పోలీసులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. పలమనేరు డీఎస్పీ చౌడేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో జడ్పీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే, మేయర్ ఇలా ఎందరో మహిళా ప్రజా ప్రతినిధులు ఉన్నారని, మహిళా సాధికారతకు ఇది సంకేతమని చెప్పారు. మహిళలు రిజర్వేషన్లు వినియోగించుకొని రాణించాలని సూచించారు. రానున్న రోజుల్లో మహిళలు అన్ని స్థాయిల్లో రాణించి ప్రమీల రాజ్యం ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమానికి నాంది పలికిన జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబుతో పాటు పోలీసు వ్యవస్థకు అభినందనలు తెలిపారు. ఆడవాళ్లు అంటే వంటింటి కుందేళ్లు కాదని మరోసారి నిరూపించాలని సాహస యాత్రలో పాల్గొంటున్న మహిళా కానిస్టేబుళ్లను కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాహస యాత్రకు బయల్దేరుతున్న మహిళా కానిస్టేబుళ్లు నాగరత్న, నిర్మల, తిరుమల, భార్గవిలను పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు. చివరగా శాంతికి చిహ్నంగా పావురాలను ఎగురవేశారు. జిల్లా కేంద్రంలోని ప్రారంభమైన యాత్ర వెంట మహిళా ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థినులు కొంతదూరం సైకిళ్లపై ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యప్రభ, మేయర్ హేమలత, ఎమ్మెల్సీ రాజసింహులు(దొరబాబు), తెదేపా జిల్లా అధ్యక్షుడు నాని, డీఎస్పీలు, సీఐలు, పెద్దసంఖ్యలో విద్యార్థినులు, పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత జాబితాను రూపొందించాలి

గుంటూరు : జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరుద్యోగ యువత జాబితాను 15 రోజుల్లోగా రూపొందించి అందించాలని కలెక్టర్ కోన శశిధర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లాస్థాయి నైపుణ్యాభివృద్ధి సంఘం సమావేశం జరిగింది. తొలుత నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ, మెప్మా ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను తెలిపారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫెయిల్ అయిన వారే కాకుండా, ఉత్తీర్ణులైన వారితో సహా అన్ని పైస్థాయిల్లో ఉన్న నిరుద్యోగ యువత వివరాలు అందించాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని, ఈ విషయాన్ని అధికారులు గ్రహించి వారి వారి శాఖల పరిధిలో ఎక్కువ సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. జాబ్‌మేళా ద్వారా ఎంపికైన యువత కంపెనీల్లో ఆరు నెలలు పనిచేసిన తర్వాత కంపెనీలు ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఒకసారి ఎంపిక అయిన తర్వాత అదే కంపెనీలో ఉద్యోగం కొనసాగే విధంగా చూడాలని, ఎంపిక అయిన వారు ఉద్యోగాలలో చేరిన తర్వాత కొనసాగుతున్నారా లేదా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ హబీబ్‌బాష, ఉపాధి కల్పనాధికారి రజనీప్రియ, డీఐసీ జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సలీం, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ అజేష్‌చౌదరి పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉక్కు పిడికిలి

## జిల్లా వ్యాప్తంగా లక్ష మంది విద్యార్థుల నిరసన

కడప : తల్లిదండ్రులు కష్టపడి మమ్మల్ని చదివిస్తున్నారు.. మేము కూడా చదువులో బాగా రాణిస్తున్నాం. కానీ అనుకున్న విధంగా ఉద్యోగావకాశాలు రావడం లేదు. ఉక్కు పరిశ్రమ వస్తే సమస్యలు తీరతాయి అని విద్యార్థులు నినదించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఉక్కు పిడికిలి బిగించి నినదించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (అభావిస) ఉక్కు ఉద్యమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కడప నగరంలో వివిధ కళాశాలల్లో నల్లజెండాలు, బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణ కళాశాలలో జరిగిన నిరసన కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ (భాకపా) జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య పాల్గొని ప్రసంగిస్తూ.. విద్యార్థుల ఉక్కు నినాదాలు, ప్రభుత్వాలకు చెంపపెట్టు కావాలని అన్నారు. కడప ఉక్కు రాయలసీమ ప్రజల హక్కు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉక్కు పరిశ్రమపై ఆధారపడిందని చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రం పూర్తిగా నష్టపోయిందని, ఉద్యోగాలు లేక, ఉపాధి లేక వలసలు పెరిగాయని, రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని, ఇంత జరుగుతున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినట్లైనా లేదా? అని ప్రశ్నించారు. యువత, విద్యార్థులు తలుచుకుంటే ఉక్కు పరిశ్రమ సాధిచడం కష్టమేమీ కాదని, ప్రతి విద్యార్థి ఒక సైనికుడై ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. అభావిస రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దస్తగిరి మాట్లాడుతూ.. ఉక్కు ఉద్యమాన్ని అనగదొక్కే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని, శాంతియుతంగా నిరసనలు చేస్తుంటే కళాశాలల వద్దకు ముందే పోలీసులను పంపి, అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# కింది కోర్టు తీర్పును ఖరారు చేసిన జిల్లా కోర్టు

నరసరావుపేట : కింది కోర్టు తీర్పును ఖరారు చేస్తూ 13వ అదనపు జిల్లా జడ్జి కె.జయకుమార్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మండలంలోని పెదతురకపాలెం గ్రామానికి చెందిన పలనాటి సుభాని అదే గ్రామానికి చెందిన షేక్ హైనా చిన్నమస్తాన్‌వలి మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 29-1-2014న సుభాని కత్తితో చిన్నమస్తాన్‌వలిపై దాడి చేసి చేతి వేలును నరికాడు. మస్తాన్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గ్రామీణ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా ఏడాది జైలు, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుడు సుభాని జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకోగా సాక్షులను విచారించిన న్యాయమూర్తి కింది కోర్టు విధించిన శిక్షను ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ పంగులూరి ఆంజనేయులు చౌదరి నిర్వహించారు.

# డ్వాక్రా సంఘాలకు రూ.600 కోట్ల రుణ పంపిణీయే లక్ష్యం

వేంపల్లె : జిల్లాలో డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.600 కోట్ల రుణసాయం అందించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టరు నాగరాజు తెలిపారు. వేంపల్లె వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని 28 వేల డ్వాక్రా సంఘాలకు వచ్చే మార్చి ఆఖరు నాటికి రూ.600 కోట్ల మేర రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్ణయించగా.. ఇప్పటివరకు 10 వేల సంఘాలకు రూ.175 కోట్ల వరకూ రుణాలు ఇప్పించామని తెలిపారు. స్త్రీనిధి కింద డ్వాక్రా సంఘాల వారికి రూ.53 కోట్లు ఇప్పించామని తెలిపారు. చంద్రన్న బీమా కింద ఈ ఏడాది అదనంగా 1.99 లక్షల మందిని సభ్యులుగా చేర్చామన్నారు.

డ్వాక్రా ద్వారా ఆయుర్వేద అగరబత్తీలు తయారుచేసి ఉన్నత స్థాయిలో నిలిచిన అవ్వారు వనజను ఆదర్శంగా తీసుకోవాలని నాగరాజు కోరారు. కష్టపడి ఆయుర్వేద అగరబత్తీలు తయారు చేస్తూ 15 మందికి ఈమె ఉపాధి కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో వెలుగు పులివెందుల ప్రాంతీయ సమన్వయకర్త వసంతకుమారి, ఏపీఎం ఖాదర్‌వలి, మండల సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, కార్యదర్శి మహబూబ్‌చాన్, కోశాధికారి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

# అధికారంలో ఉన్నా.. ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం : మాలకొండయ్య



రౌతులపూడి : ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారంలో ఉన్నప్పటికీ ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం.. అని భాజపా జిల్లా అధ్యక్షుడు మాల కొండయ్య అన్నారు. రౌతులపూడిలో భాజపా కార్మిక విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోళ్ల రవిబాబు అధ్యక్షతన జరిగిన భాజపా నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాలకొండయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లు పెట్టుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కేంద్ర ప్రభుత్వం నిధులతో చేసిన పనుల వివరాలను ప్రతి పంచాయతీ కార్యా లయం వద్ద ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరతామన్నారు. జీఎస్‌టీ ఫలాలు పేదలందరికీ అందుతున్నాయని, కొందరు భాజపాపై బురదచల్లేందుకు ప్రయత్నిస్తున్నా రన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పేరిట గృహ నిర్మాణాలకు నిధులు విడుదల చేస్తుంటే, వాటిపై జన్మభూమి కమిటీల పెత్తనం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం గ్రామసభ నిర్వహించి అర్హులైన పేర్లను గ్రామసభలో చదివి వినిపించాలన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సింగిలిదేవి సత్తిరాజు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా భాజపా పనిచేస్తుందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను నాయకులు కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం వీరు భాజపా మండలాధ్యక్షుడు అప్పలస్వామి, కోళ్ల కృష్ణలతో కలిసి పలువురికి ముద్ర యోజన రుణ మంజూరు పత్రాలను అందించారు.

రానున్న స్థానిక ఎన్నికలకు బూత్‌స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాలకొండయ్య సూచించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 175 స్థానాల్లో బలమైన పార్టీగా ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. రానున్న అన్ని ఎన్నికల్లో భాజపా ఒంటరిగా పోటీచేసేందుకు అవసరమైన విధంగా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రభాకర్, లోవరాజు, నాగేశ్వరరావు, చంటిబాబు, బాలుదొర తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరిత్యాల నుంచి బయటపడేలా శిక్షణ

## సర్వ్ అమలుకు జిల్లాను ఎంపిక చేయడం అభినందనీయం:మంత్రి





శ్రీకాకుళం : ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అమలు చేయనున్న సామాజిక, అత్యవసర స్పందన స్వచ్ఛంద సేవకుల కార్యక్రమం(సర్వ్) అమలు కోసం దేశంలో రెండు జిల్లాలను ఎంపిక చేయగా అందులో శ్రీకాకుళం జిల్లా ఒకటి కావటం అభిందనీయమని రాష్ట రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు దోహదపడే విధంగా జిల్లా యంత్రాంగం రూపొందించిన కాల్ అంబులెన్సు యాప్ దేశంలోనే మొదటిది కావటం సంతోషించదగ్గ విషయమని ఆయన తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో కార్యకర్తలను తయారుచేసి వారి సేవలు వినియోగించుకునేందుకు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అమలు చేయనున్న సర్వ్ కార్యక్రమాన్ని, కాల్ అంబులెన్సు యాప్‌ను మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్ఘ తీర ప్రాంతం జిల్లాలో ఉండటం వలన ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని అన్నారు. ఇటువంటి సమయంలో సర్వ్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కలిగిన వాలంటీర్లు గ్రామస్థాయిలో అందుబాటులో ఉండటం వల్ల ప్రజలను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలతో ప్రాణనష్టం తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సర్వ్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్.సుబ్రమణ్యం మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్ సేవలు ఇతర జిల్లాలు కంటే మెరుగైన ఉత్తమ సేవలు అందిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు సమయంలో ప్రజలకు స్థానికంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సెర్వ్ కార్యక్రమం దేశంలో ప్రవేశపెట్టడం ఇదే తొలిసారని తెలిపారు. యాప్ అవిష్కరణలో భాగస్వామ్యం వహించిన విశ్వనాథ్ మాట్లాడుతూ యూప్ రూపొందించడంలో గల కారణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నృత్య దర్శకుడు ఆర్.శ్రీకాంత్ శిష్య బృందం చేపట్టిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు చౌదరి ధనలక్ష్మి, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, జెసీ కె.వి.ఎన్.చక్రధరబాబు, ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ జెసీ 2 పి.రజనీకాంతరావు, ఎఎస్పీ షేక్ షీరినాబేగం, రవాణా శాఖ ఉప కమిషనర్ సి.హెచ్.శ్రీదేవి, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ఎస్.తిరుపతిరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఎల్.కృపావరం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కృషితో మేధోబ్యాంకు.. చైతన్య సంపత్తిగా బడుగులు..

సత్తెనపల్లి : సమాజంలో అశ్రద్ధకు గురైన బడుగు, బలహీన వర్గాల్ని గతంలో ఓటు బ్యాంకుగానే అందరూ చూసేవారని.. ఎన్టీఆర్ కృషితో రెసిడెన్షియల్ విద్యాలయాలు రాష్ట్రంలో ఏర్పాటైన తర్వాత బడుగు, బలహీన వర్గాలు మేధోబ్యాంకు.. చైతన్య సంపత్తిగా మారాయని శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. ఏడాదికి పదుల సంఖ్యలో నూతన రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభమవుతాయని విద్యార్థుల ఉపకార వేతనాలు, విదేశీ విద్యకు ప్రోత్సాహానికి నిధుల కొరత లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక నిధుల్ని ఇప్పుడు కేవలం దళిత, గిరిజన, బీసీ వాడల అభివృద్ధికే వెచ్చిస్తుండటం మంచి పరిణామమన్నారు. ఉపప్రణాళిక నిధులతో సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లోని కాలనీల్లో 95 శాతం రోడ్లు నిర్మించామన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ షేక్ జానీమూన్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌పై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుని వ్యక్తిగత.. పరిసరాల పరిశుభ్రతపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో వేలంవెర్రి విద్య నడుస్తుందని ఏసీ గదుల్లో చదివిస్తేనే తమ పిల్లలు ప్రయోజకులుగా మారతారని తల్లిదండ్రులు భావిస్తున్నారన్నారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలు కార్పొరేట్ కంటే మిన్నగా ఉన్నాయని వాటిలో బోధన, చదువు అనుబంధ కార్యక్రమాలు మెరుగ్గా అమలవుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు రకరకాలుగా ఉండటంతో కొంత గందరగోళం ఉందని అన్నింటిని కలిపి ఒక డైరెక్టర్ కార్యాలయం పరిధిలోకి చేర్చాలని సీఎంను కోరామని అదే జరిగితే అభ్యసన.. పరిపాలన సులుభమవుతుందన్నారు. ర్యాంకులు, మార్కుల్ని పట్టించుకోకుండా ఒత్తిడి, భయాందోళన లేని చదువును పిల్లలకు అందేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త లక్ష్మి మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించేలా సభాపతి చొరవ తీసుకోవాలన్నారు. పురపాలక సంఘం ఛైర్మన్ యెల్లినేడి రామస్వామి, పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి మాట్లాడారు.

కార్పొరేట్ కంటే మిన్నగా గురుకుల పాఠశాలల్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. 1986లో ఎన్టీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థను ఆచరణలోకి తెచ్చారన్నారు. అంబేడ్కర్ 125వ జయంతి ఉత్సవాల సందర్భంగా గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు నాలుగు అంశాల్లో ప్రపంచ రికార్డుల్ని సాధించార న్నారు. నరసరావుపేటకు ఎస్టీ గురుకుల పాఠశాలను మంజూరు చేశామని త్వరలోనే ఐదెకరాల భూమిలో దాన్ని ప్రారంభించ నున్నట్లు చెప్పారు. జిల్లాలో గురుకుల పాఠశాలలకు శాశ్వత భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని త్వరలోనే వాటిని ప్రారంభిస్తామన్నారు. మంత్రితోపాటు జడ్పీ ఛైర్మన్‌ను నియోజకవర్గ తెదేపా నేత డాక్టర్ కోడెల శివరాం జ్ఞాపికలతో సత్కరించారు. సభకు ముందుగా తాత్కాలిక గురుకుల పాఠశాల భవనాల్ని ప్రారంభించారు.

# నడుము నొప్పి అపోహలు



మనలో చాలామంది ఎప్పుడో ఒకప్పుడు నడుము నొప్పి బాధను అనుభవించినవారే. ప్రతి 10 మందిలో కనీసం 8 మంది ఏదో సమయంలో దీని బారినపడుతున్నట్టు అంచనా. ఈ నడుము నొప్పిపై అపోహలూ ఎక్కువే. వ్యాయామం చేస్తేనో, బరువులు ఎత్తితేనో నడుము నొప్పి వస్తుందని ఎంతోమంది అనుకుంటూ ఉంటారు. ఇది వస్తే పూర్తిగా మంచంపై విశ్రాంతి తీసుకోవాల్సిందేనని భావిస్తుంటారు. అసలు ఇలాంటి అపోహల్లో నిజమెంతో తెలుసుకుందామా...

**ఎప్పుడూ నిటారుగానే కూచోవాలి:**

ముందుకు వంగి కూచోవటం వల్ల వెన్నెముకకు హాని కలుగుతుందన్నది నిజమే. కానీ పూర్తి నిటారుగా, చాలాసేపు అలాగే కూచున్నా వెన్నెముక త్వరగా అలసిపోతుంది. కాబట్టి ఎక్కువ సమయం కూచోవాల్సి వస్తే.. కుర్చీ వెనక భాగానికి వెన్ను ఆనించి, కొద్దిగా ముందుకు వంగి కూచోవాలి. కాళ్లు నేలను తాకుతుండేలా చూసుకోవాలి. ఎప్పుడూ కూచునే ఉండకుండా.. గంటకోసారి లేచి కాస్త అటూఇటూ నడవటం.. ఫోనులో మాట్లాడటం వంటి పనులను నిలబడే చేస్తుండటం మంచిది.

**మరీ బరువైన వస్తువులను ఎత్తరాదు:**

ఎవరికైనా శక్తికి మించిన బరువులను ఎత్తటం శ్రేయస్కరం కాదు. అయితే నడుమునొప్పి విషయంలో ఎంత బరువు ఎత్తుతున్నామన్న దానికన్నా ఎలా పైకి లేపుతున్నామన్నదే కీలకం. ఆయా వస్తువులను దూరం నుంచి వంగి ఎత్తటం కాకుండా.. వాటికి దగ్గరగా వచ్చి మోకాళ్ల మీద కూర్చుని పైకెత్తాలి. వెన్ను నిటారుగా ఉండేలా, శరీరం బరువు కాళ్లపై సమంగా పడేలా చూసుకోవాలి. ఈ సమయంలో శరీరం పక్కలకు తిరిగినా, వంగినా వెన్నెముకను దెబ్బతీస్తుంది.

**పూర్తి విశ్రాంతి తీసుకోవటమే మంచి చికిత్స :**

చిన్న చిన్న గాయాలు, బెణుకుల వంటి కారణంగా హఠాత్తుగా నొప్పి వస్తే విశ్రాంతి తీసుకోవటం మంచిదే. అయితే పూర్తిగా మంచం మీదే పడుకోవాలనేది మాత్రం అపోహ. ఒకట్రెండు రోజులు కదలకుండా పూర్తిగా మంచం మీదే ఉండిపోతే నడుము నొప్పి మరింత ఎక్కువ అవుతుంది.

**గాయాల వల్లనే నొప్పి కలుగుతుంది :**

ఒక్క గాయాలే కాదు.. వయసుతో పాటు వచ్చే వెన్నుపూసల అరుగుదల, రకరకాల కండరాల సమస్యలు, ఇన్‌ఫెక్షన్లు, జన్యు పరమైన కారణాల వంటివి కూడా నడుము నొప్పికి కారణమవుతాయి.

**బక్క పలుచని వారికి నొప్పి రాదు :**

బరువు ఎక్కువ ఉన్న వారికి నడుమునొప్పి బాధలు ఎక్కువన్న మాట నిజమేగానీ అలాగని బక్కగా ఉండే వారికి నడుము నొప్పి రాదనుకోవటానికి లేదు. నడుము నొప్పి ఎవరికైనా రావొచ్చు. నిజానికి ఆహారం సరిగా తీసుకోకుండా చాలా సన్నగా ఉండేవారికి ఎముక క్షీణత ముప్పు ఎక్కువే. ఇలాంటి వారికి నొప్పులే కాదు, వెన్నెముక విరిగే ప్రమాదమూ ఉంటుంది.

**వ్యాయామం వెన్నెముకకు హాని చేస్తుంది :**

ఇది చాలా పెద్ద అపోహ. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే వెన్నునొప్పి రాకుండా నివారించుకునే వీలుంది. తీవ్ర గాయాల కారణంగా వెన్నునొప్పితో బాధపడుతున్నవారికి వైద్యులు ప్రత్యేక వ్యాయామాలు సూచిస్తారు. ఇక నొప్పి తగ్గిన తర్వాత తగు వ్యాయామాలు చేయటం ద్వారా మున్ముందు మళ్లీ నడుము నొప్పి బారినపడకుండా చూసుకోవచ్చు.

**నిర్లక్ష్యానికి మూల్యమెక్కువ**

నడుము యాంజైనాకు సరైన చికిత్స చేయించకుండా నిర్లక్ష్యం చేస్తే.. పురుషాంగానికి రక్తప్రసరణ మందగించి, సామర్థ్య సమస్యలు తలెత్తవచ్చు. రెండో సమస్య- పాదాలకు రక్తప్రసరణ తగ్గిపోవటం. దీనివల్ల పాదాల్లో తీవ్రమైన నొప్పితోపాటు కండ నల్లబారటం, గ్యాంగ్రీన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. సెక్సు సామర్థ్యాన్ని పదిల పరచుకోవటానికీ, పాదాల్ని పరిరక్షించుకోవటానికి మధుమేహులు నడుము యాంజైనా విషయంలో నిరంతరం జాగ్రత్తగా ఉండాల్సిందే.

**పెయిన్ కిల్లర్లు వద్దు:**

నడుము నొప్పితో బాధపడేవారు.. తరచూ డాక్టర్లను మార్చేస్తుంటారు. దీనితో వారు వాడే నొప్పినివారిణ మాత్రల (పెయిన్ కిల్లర్లు) బ్రాండ్లు కూడా ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి. కొంతమంది డాక్టర్ని సంప్రదించటానికి బదులుగా, తమకు తామే నేరుగా మందుల దుకాణానికి వెళ్లి పలురకాల మాత్రల్ని తెచ్చుకుని వాడేస్తుంటారు. ఏ కొంచెం నొప్పిగా, నలతగా ఉన్నా వెంటనే మాత్ర వేసేసుకుంటారు. ఇలా పెయిన్ కిల్లర్లను ఏళ్ల తరబడి విచ్చలవిడిగా వాడటం వల్ల రెండురకాలుగా నష్టం వాటిల్లుతుంది. ఎలాగంటే.. నొప్పి నివారిణి మాత్రలతో నొప్పినుంచి ఉపశమనం పొందుతూ, నడుము యాంజైనాకు సరైన వైద్య చికిత్స తీసుకోకపోవటం వల్ల పాదం కోల్పోయే ప్రమాదం తలెత్తుతుంది. రెండోవైపు- మూత్రపిండాల వైఫల్యం తలెత్తే అవకాశం పెరుగుతుంది. పెయిన్ కిల్లర్లను ఎక్కువెక్కువగా వాడటమే ఇలాంటి సమస్యకు కారణం. ప్రత్యేకించి మధుమేహుల్లో పెయిన్ కిల్లర్లు కిడ్నీ వైఫల్యానికి దారితీస్తాయి. కొంతలో కొంత ప్యారసెటమాల్ వంటివే కిడ్నీలకు సురక్షితమైన మాత్రలుగా తేలాయి.

# మానసిక ఒత్తిడితో తలనొప్పి

ప్రస్తుత తరుణంలో క్షణం తీరిక లేని జీవనం, నిత్యం పరుగులు, సమయాను కూలంగా నిద్ర, ఆహారంలేక... నిలకడలేని ఆలోచనల తో యంత్రాలతో పరిగెడుతూ... తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మానవుడు వ్యాధుల బారిన పడుతున్నాడు. ఇలాంటి ఒత్తిడి వలన వచ్చే వ్యాధుల్లో ముఖ్యమైనది తలనొప్పి. నేడు తలనొప్పితో ఎక్కువగా బాధపడుతున్న వాజురిలో అధికం స్త్రీలే. దీనికి గల కారణం అంతర్గత మానసిక ఒత్తిడితో పాటు అధిక పని భారం. తలనొప్పి వలన ఏ పని సరిగా చేయలేక అంతర్గతంగా మథనపడి మానసిక వ్యాధులకు సైతం గురవుతున్నారు.

**లక్షణాలు**

తలనొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు చిరాకు, కోపం ఎక్కువగా ఉండి ఏపని చేయడం కుదరదు. దీంతో పాటుగా వాంతికి వచ్చినట్లుగా అనిపించడం, శబ్దాలు భరించలేకపోవడం, వెలుతురును సరిగా చూడలేకపోవ డం, కళ్లకు చీకటి వచ్చినట్లుగా అనిపించడం వంటి లక్షణాలతో బాధపడుతుంటారు.


కొందరిలో తలనొప్పి ఒకే వైపునకు వచ్చి వేధిస్తుంది. ఇలాంటి తలనొప్పిని పార్శ్వపు నొప్పి (మైగ్రేన్) అంటారు. ఈ నొప్పి తీవ్రత క్రమంగా పెరిగి క్రమంగా తగ్గుతుంది. నొప్పి భరించలేకుండా ఉండి తల దిమ్ముగా ఉంటుంది.

**కారణాలు**

అధిక మానసిక ఒత్తిడి వలన మెదడులో కొన్ని రసాయనిక మార్పులు జరిగి తలనొప్పి వస్తుంది.




# సర్వైకల్ క్యాన్సర్‌లో తొలిదశలో గుర్తింపే కీలకం



గర్భాశయ ముఖద్వార క్యాన్సర్... దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మహిళలను ఆందోళన కలిగిస్తోన్న సమస్య. దీనిని అరికట్టేందుకు ప్రస్తుతం వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. అయినా ఈ వ్యాధి గురించి ఎక్కువమందికి అవగాహన లేదని అధ్యయనాలు తెలుపుతున్నాయి. దీంతో ఈ క్యాన్సర్ బారిన పడే వారి సంఖ్య పెరుగుతోందని అవి చెప్తున్నాయి. ఈ సమస్యను కలిగించే వైరస్ శరీరంలోకి ప్రవేశించిన తరువాత, క్యాన్సర్‌గా రూపాంతరంగా చెందడానికి దాదాపు పదిసంవత్సరాల సమయం పడుతుంది. ఈ కాలంలో వైరస్ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చికిత్స పొందవచ్చు. పూర్తిగా నివారించవచ్చు అంటున్నారు వైద్యులు. ఈ సర్వైకల్ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం చాలా సులభం. కనుక పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. తొలి దశలో గుర్తిస్తే వెంటనే చికిత్స తీసుకుని అందరిలా జీవితాన్ని కొనసాగించవచ్చు.

సెర్విక్స్ గర్భాశయపు ప్రవేశం దగ్గర ఉంటుంది. గర్భాశ యం లోకి ఇన్‌ఫెక్షన్‌లు ప్రవేశించకుండా ఈ సెర్విక్స్ నివా రిస్తుం ది. ముఖ్యంగా గర్భధారణ కాలంలో ఇది చాలా ముఖ్యం. అప్పు డు సెర్విక్స్ ఇన్‌ఫెక్షన్‌లను గర్భాశయానికి బయటనే ఉంచి, లోప ల పెరుగుతున్న పిండాన్ని సంరక్షిస్తుంది. ఈ సెర్విక్స్‌కి వచ్చే క్యాన్సర్‌నే గర్భాశయపు ముఖద్వార క్యాన్సర్ అంటారు. మహిళ ల్లో ప్రధానంగా వచ్చే క్యాన్సర్‌లలో ఇది ఒకటి. 25 నుంచి 65 ఏళ్ల వయసు వరకు ఎప్పు డె%నా రావచ్చు. భారత్‌లో 1లక్ష 35 వేల మంది ప్రతి ఏటా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రతి సం వత్సరం 74 వేల మంది చనిపోతున్నారని వె%ద్యరీత్యా నిర్ధారణ అయింది. సర్వైకల్ క్యాన్సర్ బాగా ముదిరిపోయేంతవరకు ఎలాం టి లక్షణాలు కనబడదు. దీంతో ఎక్కువ మంది ఈ క్యాన్సర్ బారి న పడుతున్నారు. ఈ క్యాన్సర్ వంశపారంపర్యంగా రాదు. పట్ట ణాల్లోని వారికంటే, గ్రామీణ ప్రాంతంలోని వారికి ఎక్కువగా వస్తుంది. దేశం మొత్తం మీద 2-3 శాతం మందికి సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు.

**కారణాలు:**

ఈ క్యాన్సర్ రావడానికి ప్రత్యేకమైన కారణాలు తెలియవు. కొంతమంది పేద మహిళల్లో శరీరం పట్ల శుభ్రత తక్కువగా ఉంటుంది. అటువంటి వారిలో ఈ క్యాన్సర్ రావడా నికి అవకాశాలు ఎక్కువ. ఇంకా... చిన్న మయసులోనే రసజ్వల కావడం, 20 సంవత్సరాల కంటే తక్కువ వయసులో పెళ్లి చేయ డం, లేత వయసులోనే పిల్లలు పుట్టడం. ఎక్కువ మంది పిల్లలు పుట్టడం, ఎక్కువమందితో సెక్స్‌లో పాల్గొనడం వంటి వాటిని ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. సుఖవ్యాధులు ఉన్నవారిలో అధికంగా వచ్చేందుకు ఆస్కారం ఉంది. హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ)ద్వారా ఎక్కువమందిలో ఈ క్యాన్సర్ వస్తుంది. ఈ వైరస్‌లో ముఖ్యంగా 16,18, 31, 35 రకాలలో ఇది వస్తుం ది. హెర్పిస్ టైప్ వైరస్ వల్ల వచ్చేందుకు కూడా ఆస్కారం ఉంది. డీబీస్ వంటి కొన్ని ఔషధాలను గర్భం దాల్చినప్పుడు స్త్రీలు తీసు కుంటే, వారికి పుట్టబోయే అమ్మాయిలకు ఈ క్యాన్సర్ రావచ్చు. పొగతాగే వారిలో వచ్చే అవకాశం ఉంది.

హెచ్‌పీవీ లాంటి వె%రస్ వల్ల సెర్విక్స్‌లో దీర్ఘకాలంలో మార్పులు వచ్చి క్యాన్సర్‌కు దారితీస్తాయన్న విషయం ఆందోళన కలిగిం చవచ్చు. అయితే సెర్విక్స్ క్యాన్సర్ ముందుగా వచ్చే ప్రీ- క్యాన్సర్ దశ చాలా కాలం (దాదాపు ఎనిమిది నుంచి పదేళ్లు) కొనసాగు తుంది. అంటే అది పూర్తి క్యాన్సర్‌గా రూపొందడానికి సాగే ముం దస్తు దశ ఇంత సుదీర్ఘకాలం కొనసాగుతుంది. కాబట్టి అక్కడ వచ్చే మార్పులను ముందుగానే పసిగడితే అది క్యాన్సర్ కాకముందే లేజర్, ఎల్ఎల్ఈటీజడ్ వంటి విధానాలతో చికిత్స చేయడం సాధ్యపడుతుంది. తొందరగా తెలుసుకుంటే చికిత్స సులభంగా ఉంటుంది.

**వ్యాధి నిర్ధారణ ఎలా చేయాలి?**

గర్భాశయపు ముఖద్వార క్యాన్సర్‌ను గుర్తించేందుకు ప్రధానంగా మూడు పరీక్షలున్నాయి.

1. పాప్ స్మియర్ స్క్రీనింగ్ టెస్ట్ : ఎంతో సులువుగా, తక్కువ ఖర్చుతో చేయగల పరీక్ష ఇది. దీంతో సెర్వి క్స్ క్యాన్సర్‌ను ప్రీ క్యాన్సర్ దశలోనే గమనించి సమ ర్థంగా చికిత్స చేయడం సాధ్యపడుతుంది. ఇందులో గర్భాశయ ముఖద్వారం వద్ద వైట్ డిశ్చార్జ్ కణాలను స్లైడ్ మీద వేసి హిస్టో పెథాలజీకి పంపిస్తారు. ఈ పరీక్ష చేయించుకున్న వెంటనే ఇంటికి వెళ్లవచ్చు. 20 సంవత్సరాలకు పైబడిన వారు రెండు సంవత్సరాలకు ఒకసారి చేయించుకుంటే మంచిది. కనీసం ఐదు సంవత్సరాలకు చేయించుకోవడం అవసరం.

2. కాల్పోస్కోపీ : ప్రత్యేక పరికరం ద్వారా సెర్వైక్ ప్రాం తాన్ని పరీక్షిస్తారు. వాపు, పుండు, ఒరుపు వంటి వాటిని గమనిస్తారు. అసాధారణంగా ఉన్న ప్రదేశాన్ని పరిశీలి స్తారు. అవసరమె%తే ముఖ పరీక్ష చేస్తారు.

3. సెర్వికల్ బయాప్సీ : క్యాన్సర్ అని అనుమానం వచ్చినప్పుడు సర్విక్స్‌లోని కొంత భాగాన్ని తీసి పరీక్షిస్తా రు. ఈ పరీక్షల ద్వారా ఏ రకం క్యాన్సరో, ఏ దశలో ఉందో గుర్తించవచ్చు.

ఈ క్యాన్సర్ ముదిరిపోతే రక్తపరీక్ష, హిమోగ్లోబిన్ టోటల్ కౌంట్, బ్లడ్ సుగర్, బ్లడ్ గ్రూప్, బ్లడ్ యూరి యా, యూరిన్ ఎగ్జామినేషన్‌లు చేయించాలి. కొంత మందిలో అవసరమె%తే సీటీ, ఎంఆర్ఐ స్కాన్ చేసి వ్యాధి తీవ్రతను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

**లక్షణాలు:**

ప్రారంభ దశలో ఏ లక్షణాలు ఉండవు. పరీక్షల ద్వారా కనుక్కోవచ్చు.

తొలి దశ క్యాన్సర్ : ఈ సమయంలో పాప్ స్మియర్, కాల్పోస్కోపీ ద్వారా గుర్తించవచ్చు. ఇందులో మెల్ట్, మోడరేట్, సివియర్ అని మూడు రకాలుంటాయి. ఈ దశలో చిన్న పద్ధతుల్లో ఈ వ్యాధిని నయం చేయవచ్చు. క్రయో, లేజర్, లూప్ ఎక్సెషన్, కొనె%జేషన్ ద్వారా నయం చేయవచ్చు. భవిష్యత్తులో పాప్ స్మియర్ ద్వారా పరీక్ష చేయించుకుంటూ ఉండాలి.

**లక్షణాలు:**

క్యాన్సర్‌గా మారిన తర్వాత ఈ కింది లక్షణాలుంటాయి.

- అధిక రక్తస్రావం, నెల మధ్యలో రక్తస్రావం కాకుండా లేదా అప్పు డప్పుడు రక్తస్రావం అవుతుంది. దంపతుల కలయిక తరువాత రక్తస్రావం జరుగుతుంది. నెలలు ఆగిన తరువాత (మెనోపాజ్) రక్తస్రావం రావడం. వైట్ డిశ్చార్జ్ కావడం. రక్తంతో కలిసి వె%ట్ డిశ్చార్జ్, వాసనతో కూడిని వైట్ డిశ్చార్జి కావచ్చు.

**ముదిరిన తరువాత:**

బరువు తగ్గిపోవడం, ఆకలి మంద గించడం, రక్తహీనత, బలహీనత, తలనొప్పి. కడుపునొప్పి. యూరిన్ పోసేటప్పుడు నొప్పి, మోషన్‌కు వెళ్లినప్పుడు నొప్పి వంటి సమస్యలుంటాయి. కొందరిలో కిడ్నీ సమస్యలు రావచ్చు. దీంతో కిడ్నీ పూర్తిగా దెబ్బతిని చనిపోయేందుకు ఆస్కారం ఉంది.

రెండు రకాలుగా: క్యాన్సర్‌లో గ్రోత్, అల్సర్‌గా రెండు రకా లుంటాయి. ఇది వైద్యుల పరీక్షలో తెలుస్తుంది.

గ్రోత్ : ఈ రకమైన క్యాన్సర్‌లో బ్లీడింగ్ ఎక్కువగా ఉంటుంది. రక్తంలో ముక్కలు, ముక్కలుగా వస్తుంటుంది. గర్భాశయం చుట్టు ప్రదేశాల్లోని అవయవాలు, కండరాల కదలిక తగ్గిపోతుం టుంది. అల్సర్ రకంగా పుండు మాదిరిగా ఉంటుంది.

**నాలుగు దశల్లో ఉంటుంది:**

మొదటి దశలో క్యాన్సర్ గర్భాశయ ముఖద్వారం వద్దే ఉంటుంది. రెండవ దశలో గర్భాశయానికి పాకుతుంది. మూడో దశ గర్భాశయం చుట్టు పక్కల ప్రాం తాలకు చేరుతుంది. నాల్గో దశలో శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది.

చికిత్స మూడు రకాలు : 1. ఆపరేషన్, 2. రేడియో థెరఫీ 3. కీమోథెరపీ 4. కంబైడ్‌గా చేస్తారు.

ఈ క్యాన్సర్‌ను మొగ్గ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు.

**వ్యాక్సిన్:**


వ్యాక్సిన్ ద్వారా ముందుగానే హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను అడ్డుకోవచ్చు. పది సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వరకు ఎవరైనా తీసుకోవచ్చు. దీనిని మూడు డోస్‌లలో ఇస్తారు. ఒకటో నెల, తరువాత రెండవ నెల, ఆ తరువాత ఆరవ మాసంలో టీకాలు తీసుకోవాలి. చిన్నపిల్లలకు అయితే పాప్ స్మియర్ పరీక్ష చేయకుండా వ్యాక్సిన్‌ను తీసుకోవచ్చు. పెద్దవారె%తే పాప్ స్మియర్ పరీక్ష చేసుకుని టీకాలు తీసుకోవడం మంచిది. ఈ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం చాలా సులభం. కనుక పరీక్షలు చేయించు కుంటూ ఉండాలి. తొలి దశలో గుర్తిస్తే వెంటనే చికిత్స తీసు కుని అందరిలా జీవితాన్ని కొనసాగించవచ్చు.

# చాక్లెట్ తింటే మధుమేహం దూరం!



లండన్‌: రోజూ వంద గ్రాముల చాక్లెట్ తిని మధుమేహాన్ని దూరం చేసుకోవచ్చంటున్నారు తాజా అధ్యయనకారులు. త్వరలో డాక్టర్లు కూడ ఇదో వైద్యంగా సలహా ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. డార్క్ చాక్లెట్ తీసుకోవడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించ వచ్చని లండన్ లోని వార్విక్ యూనివర్శిటీ జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది. చాక్లెట్ లో ఉండే పదార్థాలు ఇన్సులిన్ లెవెల్స్ ను నియంత్రిస్తాయని తద్వారా గుండె జబ్బులు కూడ వచ్చే అవకాశం తగ్గుతుందని చెప్తున్నారు. వార్విక్ విశ్వవిద్యాలయం అధ్యయనకారులు 18 నుంచి 69 ఏళ్ళ మధ్య వయసుగల 1153 మందిపై నిర్వహించిన పరిశోధనల్లో తాజా విషయాలు వెలుగులోకి వచ్చాయి. చక్కెర వ్యాధి గ్రస్థులు ప్రతిరోజూ వంద గ్రాముల డార్క్ చాక్లెట్ తీసుకోవడం వల్ల మధుమేహం నియంత్రణకు సహకరించడంతోపాటు ఇతర హృద్రోగ సమస్యలు కూడ చాలావరకూ తగ్గే అవకాశం ఉందని లక్సెంబర్గ్ పరిశోధనల్లో తెలుసుకున్నారు. డార్క్ చాక్లెట్ తయారీకి వినియోగించే కోకోలో మధుమేహాన్ని నియంత్రించే శక్తి ఉన్నట్లు పరిశోధకులు కనుగొన్నారు. ప్రతిరోజూ 100 గ్రాముల చాక్లెట్ ను తీసుకోవడం వల్ల లివర్ లోని ఎంజైములు అభివృద్ధి చెంది, ఇన్సులిన్ ను నియంత్రించేందుకు తోడ్పడుతుందని పరిశోధకులు చెప్తున్నారు. అలాగే ఈ చాక్లెట్ ను ప్రతిరోజూ తీసుకునేవారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని, రోజుకు 28.8 గ్రాముల చొప్పున ప్రతిరోజూ తీసుకునే వారిలో చురుకుదనం పెరిగి ఉత్సాహంగా ఉన్నట్లు పరిశోధనల్లో తేలినట్లు చెప్తున్నారు. అంతేకాక కోకో ఉన్న ఉత్పత్తులను తరచుగా తీసుకోవడం వల్ల కూడ గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చని, ఇది గుండె మెటబాలిక్ కండిషన్ ను మెరుగు పరుస్తుందని వార్విక్ మెడికల్ స్కూల్ పరిశోధకుల సెవేరియో స్టేంజెస్ తెలిపారు. పరిశోధనా వివరాలను బ్రిటిష్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ లో ప్రచురించారు.

# మొటిమల నివారణకు ఇలా చేయండి..



టీనేజర్లు మొటిమల నివారణ కోసం ఏవేవో క్రీములు వాడుతుం టారు. కానీ మన ఇంట్లో ఉండే వస్తువులతోనే మొటిమలను నివారిం చవచ్చు. ఆ చిట్కాలేంటో తెలుసు కుందాం. తులసి ఆకు, రసం కొంచెం మెత్త గా కలిపి రాత్రి పడుకో బోయే ముందు ముఖా నికి రాసుకుని ఉదయం గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే మొటిమలు పోతాయి.

అలాగే కొంచెం వేపాకు మెత్తగా నూరి దానికి చందనం పొడి కలిపి మొటిమల మీద పూసి గంట తర్వాత స్నానం చేయండి మొటిమలు తొలగిపోతాయి. రోజ్‌వాటర్‌లో చందనంపొడి పసుపు నీళ్లలో కలిపి పేస్టులా చేసి ముఖానికి రాసి పది నిమిషాల తర్వాత కడిగినా ఫలితం ఉంటుంది. మందులషాపులలో లభించే క్లియరాసిల్ ఆయింట్‌మెంట్ ప్రతిరోజూ రాత్రిపూట రాసుకుని ఉదయం గోరువెచ్చని నీటితో కడగండి. చందనం పొడి, కర్పూరం పొడి నీటిలో కలిపి పేస్టులా చేసి రాత్రిపూట రాసుకుని ఉదయమే కడుక్కుంటే మొటిమలు పోతాయి.

# చర్మం ముడుతలను తగ్గించే 'ఖర్బూజా పండు'


❍ పావుకప్పు ఖర్బూజా పండు గుజ్జులో రెండు టీస్పూన్ల పాలను కలిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని శుభ్రం చేసుకుంటే చర్మంపైన ముడుతలను తగ్గిస్తుంది. అంతేకాకుండా చర్మం కూడా మృదువుగా తయారవుతుంది.

❍ ఖర్బూజా గింజలను ఎండబెట్టి, గింజలపై పొట్టు తీసివేసి మెత్తగా నూరుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. తరువాత మెల్లిగా మర్దనా చేసుకున్నట్లయితే చక్కటి స్క్రబ్‌లాగా పనిచేసి స్వేదగ్రంథులను తెరచుకునేలా చేస్తుంది. దాంతో చర్మం చూడగానే ఇట్టే ఆకట్టుకునేలా మెరిసిపో తుంది.

❍ ఖర్బూజా పండు ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. ఈ పండును క్రమం తప్ప కుండా తీసుకున్నట్లయితే ఎసిడిటీ, అల్సర్ల నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరంలో లవణాలు, నీటి శాతం తగ్గటంవల్ల వచ్చే మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లను కూడా దూరమవు తాయి. ఈ పండు తొక్కను కషాయంలాగా కాచి కొబ్బరినీటితో కలిపి తీసుకుంటే మూత్ర సంబంధ వ్యాధులు తగ్గుముఖం పడతాయి.

# చిత్రభాను

## బాలయ్యతో బోయపాటి మల్టీస్టారర్..?



నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను అంటేనే హిట్ కాంబినేషన్. గతంలో వీరిద్దరు కలిసి పనిచేసిన సింహా, లెజెండ్ వంటి సినిమాలు బ్లాక్ బాస్టర్లుగా నిలిచాయి. మూస ధోరణిలో వెళ్తున్న బాలయ్యను తెరపై విభిన్నంగా, చాలా పవర్‌ఫుల్‌గా చూపించిన దర్శకుడు బోయపాటి. ఇప్పుడు మరోసారి వీరిద్దరు కలిసి పని చేయబోతున్నారని తెలుస్తోంది. అయితే బాలయ్యతో సినిమా మొదలుపెట్టేలోపు బోయపాటి మరో సినిమాను పూర్తి చేసే ఆలోచనలో పడ్డాడు. ఈ క్రమంలో రామ్ చరణ్ పేరు ఎక్కువగా వినిపిస్తోంది. నిర్మాత డీవీవీ దానయ్యతో కలిసి సినిమా చేస్తానని చరణ్ ఇప్పటికే మాటిచ్చాడు. ఇప్పుడు వీరి ముగ్గురి కాంబినేషన్‌లో సినిమా రానుందని టాక్. ఈ సినిమా తరువాత వచ్చే ఏడాది జులై లేదా ఆగస్ట్ నెల నుంచి బాలయ్య సినిమాను మొదలుపెట్టాలని భావిస్తున్నాడు బోయపాటి శ్రీను. ఇప్పటికే బాలయ్యకు కథ వినిపించడం, దానికి ఆయన్ని ఒప్పించడం జరిగిపోయాయట. అయితే ఇప్పుడు ఈ కథకు సంబంధించిన మరో ఆసక్తికర విషయం వెలుగులోని వచ్చింది. బోయపాటి ఈసారి బాలయ్యతో ఓ మల్టీస్టారర్ సినిమాను చేయడానికి ప్లాన్ చేస్తున్నాడట.

ఈ సినిమాలో బాలయ్యతో పాటు మరో అగ్ర హీరోకు అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే మరో హీరోగా ఎవరిని తీసుకోబోతున్నారనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. సినిమాను పట్టాలెక్కించడానికి మరికొంత సమయం ఉండడంతో బోయపాటి ఇంకా సెకండ్ హీరోను ఫైనల్ చేయలేదని సమాచారం. ఈ నిర్ణయం కూడా బాలయ్య ఛాయిస్‌కు వదిలేసే అవకాశాలు ఉన్నాయి.

## ఆక్సిజన్ గీతావిష్కరణ



గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ఆక్సిజన్. జ్యోతికృష్ణ దర్శకుడు. రాశీఖన్నా, అను ఇమ్మాన్యుయెల్ కథానాయికలు. ఐశ్వర్య నిర్మాత. యువన్‌శంకర్‌రాజా స్వరపరచిన ఈ చిత్ర గీతాల్ని సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. తొలి సీడీని శరత్‌కుమార్, నాజర్ సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ నేటి సమాజానికి ఉపయుక్తమయ్యే సందేశాత్మక చిత్రమిది. కుటుంబ అనుబంధాల ప్రధానంగా సాగుతుంది. యాక్షన్‌కు కూడా మంచి ప్రాధాన్యత వుంటుంది. రత్నంగారు అంటే నాకు చాలా గౌరవం. ఆయన కోసమే ఈ సినిమా చేశాను. జ్యోతికృష్ణ చెప్పిన కథ బాగా నచ్చింది. నాకు ఇష్టమైన సంగీత దర్శకుల్లో యువన్‌శంకర్‌రాజా ఒకరు. ఆయనతో సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. కథానుగుణంగా యువన్ మంచి బాణీలిచ్చారు. నా కెరీర్‌లో విభిన్నమైన చిత్రంగా నిలిచిపోతుందనే నమ్మకముంది అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఈ సినిమాలో గోపీచంద్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో సాగుతుంది. ఆయన మూడు భిన్న పార్శ్వాల్లో కనిపిస్తారు.

ఇంటర్వెల్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుంది. షుటింగ్‌లో గాయాలైనా లెక్కచేయకుండా గోపీచంద్ సినిమా కోసం శ్రమించారు. నా దృష్టిలో ఆయన రియల్‌హీరో. సమకాలీన సమాజానికి తగినట్లుగా చక్కటి సందేశం వున్న చిత్రమిది. ఇప్పటివరకు నేను తెలుసుకున్న విషయాలన్నింటిని చూపించాను అన్నారు. ఎ.ఎం.రత్నం ఎన్నో బ్లాక్‌బస్టర్ హిట్స్ అందించారు. ఈ సినిమాతో తిరిగి ఆయన సక్సెస్ సాధించాలి అని పోకూరి బాబూరావు చెప్పారు. కథానుగుణంగా వైవిధ్యమైన బాణీలను అందించే అవకాశం లభించిందని, పాటలు అందరిని ఆకట్టుకుంటాయని యువన్‌శంకర్ రాజా తెలిపారు. తెలుగులో తొలిగా అంగీకరించిన చిత్రమిదేనని, తన పాత్ర చిత్రణ వినూత్నంగా వుంటుందని అనూఇమ్మాన్యుయెల్ చెప్పింది. ఎం.ఎం.రత్నం మాట్లాడుతూ ఈ సినిమా టైటిల్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు.

## చార్మీ, పూరీ సహజీవనం చేస్తున్నారా..?!



దర్శకుడు పూరీ జగన్నాథ్, నటీమణి చార్మి కౌర్‌ల విషయంలో టాలీవుడ్ లో ఇప్పుడు కొత్త పుకారు వినిపిస్తోంది. వీళ్లిద్దరూ సహజీవనంలో ఉన్నారు..అనేది ఈ పుకారు సారాంశం. గత కొన్నాళ్లుగా చార్మీ, పూరీలు సఖ్యతగా ఉంటున్న వైనం మీడియా ద్వారా అందరికీ అర్థం అవుతూనే ఉంది. ఆ మధ్య పూరీ దర్శకత్వంలో వచ్చిన జ్యోతిలక్ష్మీ సినిమాలో చార్మి ప్రధాన పాత్ర పోషించింది. ఆ తర్వాత పూరీతో కలిసి నిర్మాతగా పాలు పంచుకుంటోందామె. అలాగే పూరీ ప్రాజెక్ట్స్ కు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా చార్మీ వ్యవహరించిన దాఖలాలున్నాయి. ప్రస్తుతం పూరీ తన తనయుడి హీరోగా పెట్టి రూపొందిస్తున్న మెహబూబా సినిమాతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా ముహూర్తం షాట్ దగ్గర నుంచినే చార్మి కనిపించడం జరిగింది. ఈ సినిమా షుటింగ్ ఉత్తరభారతదేశంలో కొనసాగుతుండగా.. యూనిట్ తో పాటు చార్మీ కూడా ఉంటోంది. ఇదే సమయంలో.. వీరిద్దరి మధ్యనా సమ్‌థింగ్, సమ్‌థింగ్.. అనే మాట ఊపందుకుంటోంది!

పూరీ జగన్నాథ్ వివాహితుడు. అయినప్పటికీ ఇలాంటి రూమర్ వినిపిస్తుండటం విశేషం. పూరీ, చార్మిల సాన్నిహిత్యమే ఇలాంటి రూమర్ కు దారి తీస్తోంది. అయితే ఈ ప్రచారం గురించి పూరీ కానీ, చార్మీ కానీ ఇంకా నోరు విప్పలేదు. తమ విషయంలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించలేదు ఇంత వరకూ. ఈ తరహా ప్రేమకథలు సినీ ఇండస్ట్రీలో కొత్తేమీ కాదు. వివాహితులు అయిన దర్శకులను, హీరోలను మళ్లీ పెళ్లిళ్లు చేసుకున్న హీరోయిన్లు చాలా మందే ఉన్నారు. ఆ జాబితాలో చార్మీ కూడా చేరుతుందా? లేక తమది స్నేహం మాత్రమే అని ప్రకటిస్తుందా? లెట్ వెయిట్ అండ్ సీ!

## బికినీ సీన్ ఔట్.. లావణ్య హర్ట్!



ఒకప్పుడు హాలీవుడ్, బాలీవుడ్‌కి మాత్రమే పరిమితమయిన బికినీ కల్చర్ ఆ తరవాత టాలీవుడ్‌కి పాకింది. ఇలియానా, అనుష్క, ప్రియమణి, సమంత, నయనతార వంటి స్టార్ హీరోయిన్ల దగ్గర నుంచి శ్రద్ధా దాస్, సంజన, లక్ష్మీరాయ్ వంటి తారల వరకు అంతా బికినీల్లో మెరిశారు. ప్రస్తుతం ఇండస్ట్రీకి పరిచయమవుతున్న కొత్త హీరోయిన్లు కూడా బికినీలు వేసి కుర్రకారుని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ మధ్య వచ్చిన రాజు గారి గది 2 సినిమాలో సీరత్ కపూర్ కూడా బికినీ వేసి సినిమాకి బజ్‌ను తీసుకొచ్చింది. తాజాగా రామ్ హీరోగా నటించిన ఉన్నది ఒకటే జిందగీ సినిమాలో.. లై ఫేమ్ మేఘ ఆకాష్‌ని రీప్లేస్ చేసి ఛాన్స్ దక్కించుకున్న లావణ్య త్రిపాఠి కూడా బికినీ వేసిందట. ప్రస్తుతం లావణ్య కెరీర్ అంతంత మాత్రంగా ఉంటుండడంతో ఈ నిర్ణయం తీసుకుందట.

కానీ ఫస్ట్ కాపీ చూసిన తరువాత కంటెంట్‌కి ఆ బికినీ సీన్స్‌కి అస్సలు కుదరడంలేదని దర్శకనిర్మాతలు వాటిని ఎడిట్ చేశారట. దాంతో తీవ్ర నిరాశకు గురైన లావణ్య.. ఈ సినిమా ప్రమోషన్స్‌పై కూడా అంత ఇంట్రెస్ట్ చూపించడంలేదని అంటున్నారు. ప్రస్తుతం ఆమెకు హిట్‌తో పాటు గుర్తింపు కూడా కావాలి. ఈ క్రమంలో ఆమె చేసిన గ్లామర్ షో వృథా అవుతుందనే బాధలో ఆమె ఉన్నట్లుంది.

## డైలామాలో హిట్ డైరెక్టర్ !



అవకాశాలేవి.. డైలామాలో హిట్ డైరెక్టర్!

సినిమా ఇండస్ట్రీలో ఒక డైరెక్టర్ హిట్ కొడితే చాలు.. అతడితో సినిమాలు చేయడానికి ఎగబడతారు మన హీరోలు. కానీ ఈ మధ్య హిట్ డైరెక్టర్లకు కూడా అవకాశాలు రావడానికి చాలా సమయం పడుతుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఉన్న స్టార్ హీరోలు, మీడియం రేంజ్ హీరోలు తమ తమ ప్రాజెక్ట్స్‌తో బిజీ అయిపోవడం వలన హిట్ ఇచ్చిన దర్శకులు కూడా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి కలుగుతోంది. చిరంజీవితో ఖైదీ నెంబర్ 150 వంటి బ్లాక్ బస్టర్ సినిమాను తెరకెక్కించిన వి.వి.వినాయక్‌కు గ్యాప్ తప్పలేదు. హీరోలంతా ప్రస్తుతం బిజీగా ఉండడంతో దాదాపు ఆరు నెలల పాటు గ్యాప్ తీసుకోవాల్సి వచ్చింది.

ఇప్పుడు దర్శకుడు కె.ఎస్.రవీంద్ర (బాబీ)కి కూడా అలాంటి పరిస్థితే ఎదురవుతోంది. ఎన్టీఆర్‌తో బాబీ తెరకెక్కించిన జై లవ కుశ ఎంత మంచి విజయాన్ని అందుకుందో అందరికీ తెలిసిందే. ఈ సినిమా షుటింగ్ సమయంలో.. బాబీ తదుపరి సినిమా రవితేజతో ఉంటుందని అన్నారు. అలానే అల్లు అర్జున్‌తో కూడా సినిమా చేసే ఛాన్స్ ఉందని టాక్ వినిపించింది. కానీ ప్రస్తుతం రవితేజ, అల్లు అర్జున్ ఇద్దరూ తమ సినిమాలతో బిజీగా ఉన్నారు.

రవితేజ డైరీలో మరో ఏడాదిన్నర వరకు ఖాళీ లేదు.

మరోవైపు అల్లు అర్జున్‌తో సినిమా చేయడం అంత సులభం కాదు. ఇప్పుడు రవితేజ కోసం అనుకున్న కథను నానికి చెప్పి ఓకే చేయించుకోవాలని చూస్తున్నాడు బాబీ. ఒకవేళ నాని అంగీకరించినా.. సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందో తెలియని పరిస్థితి. ఎందుకంటే నాని కోసం చాలా మంది దర్శకులు వెయిటింగ్‌లో ఉన్నారు. దీంతో ఏం చేయాలో.. ఎవరిని అప్రోచ్ అవ్వాలో తెలియక తలపట్టుకుంటున్నాడట ఈ దర్శకుడు.

## ఎన్టీఆర్ సినిమాతోనేనా కమెడియన్ రీ-ఎంట్రీ?



కమెడియన్ నుండి హీరోగా మారి వరుసపెట్టి సినిమాలు చేస్తున్న సునీల్‌కి హిట్ సినిమా పడి చాలాకాలమే అయింది. కమెడియన్‌గా తిరుగులేని స్టార్‌డమ్‌తో దూసుకెళ్లిన సునీల్, ఆ తర్వాత హీరోగా ఆ స్థాయిని అందుకోలేక, మళ్లీ కమెడియన్‌గా రీ-ఎంట్రీ ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్వయంగా సునీలే ఈ విషయం చెప్పారు. మంచి కథలు వస్తే హీరోగా చేస్తానే, ఇకపై కమెడియన్‌గా చేయాలని అనుకుంటున్నానని సునీల్ తెలిపారు.

మరి సునీల్ రీ-ఎంట్రీ ఏ సినిమాతో ఉండబోతోంది అనేది కూడా ఈ మధ్య సెన్సేషనల్ న్యూస్‌గా చెప్పుకోబడింది. ఎందుకంటే హీరోగా చేసిన సునీల్‌కి ఏ హీరో అవకాశం ఇస్తాడా.. అని అందరూ ఎదురుచూస్తున్నారు. అయితే దీనిపై ఓ క్లారిటీ వచ్చినట్లుగానే తెలుస్తోంది. త్రివిక్రమ్‌కి బెస్ట్ ఫ్రెండ్ అయిన సునీల్, ఇప్పుడు త్రివిక్రమ్ సినిమాతోనే కమెడియన్‌గా రీ ఎంట్రీ ఇవ్వబోతున్నాడనే వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో సంచరిస్తున్నాయి.

ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ చేయబోయే చిత్రంలో సునీల్ కమెడియన్‌గా మళ్లీ కనిపించనున్నారని, కష్టాల్లో ఫ్రెండ్‌ని ఆదుకునేందుకు త్రివిక్రమ్ ఈ డెసిషన్ తీసుకున్నాడని టాక్. ఈ విషయంలో ఎన్టీఆర్‌తో కూడా త్రివిక్రమ్ చర్చించాడని, ఎన్టీఆర్ కూడా సానుకూలంగా స్పందించాడని టాక్.

## ఆ సౌత్ హీరోతో నటిస్తా : ప్రియాంక



బాలీవుడ్ తో పాటు హాలీవుడ్ లోనూ సత్తా చాటుతున్న ప్రియాంక చోప్రా, సౌత్ సినిమాలు చేసేందుకు రెడీ అంటూ ప్రకటించింది. అంతేకాదు సౌత్ లో విజయ్ సరసన ఛాన్స్ వస్తే తప్పకుండా నటిస్తానంటూ క్లారిటీ ఇచ్చింది. అదే సమయంలో తన వస్త్రధారణపై వస్తున్న విమర్శలపై కూడా ఘాటుగా స్పందించింది ఈ బోల్డ్ బ్యూటీ. 'స్విమ్మింగ్ పూల్ లో బీచ్ లో చీరలతో తిరగం కదా.. అయినా నేను బాలీవుడ్ సినిమాల్లో కూడా బికినీ వేశాను. ఇప్పుడు హాలీవుడ్ లో అది కామన్ కాబట్టి అక్కడ కూడా అలాంటి దుస్తుల్లో కనిపిస్తున్నాను. ఈ మాత్రం దానికే ఎందుకంత దిగజారి కామెంట్లు చేస్తారో అర్థం కావటం లేద'ని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాదు తనను హాలీవుడ్ నటి అంటే సంతోషంగానే ఉన్నా.. వ్యక్తిగతంగా బాలీవుడ్ హీరోయిన్ అని పిలిపించుకోవటమే ఇష్టమని తెలిపింది.

## ఒలింపిక్స్‌లో పతకం సాధనే.. లక్ష్యం

**జాతీయ మినీ, కిడ్స్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ ప్రారంభం**



విజయవాడ : ఒలింపిక్స్‌లో పతకం సాధనే లక్ష్యంగా ఓల్గా ఆర్చరీ అకాడమీ ఆర్చర్లు కృషి చేస్తున్నారని మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ, రాష్ట్ర విలువిద్య సంఘం, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థల సంయుక్త సహకారంతో విజయవాడ సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో చెరుకూరి లెనిన్, ఓల్గా స్మారక 10వ జాతీయ మినీ, 2వ జాతీయ కిడ్స్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ ప్రారంభ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్వర్గీయ లెనిన్ ముందు చూపుతో 2008లోనే జాతీయ ఆర్చరీ సంఘంతో చర్చించి మినీ (అండర్-14) జాతీయ ఛాంపియన్‌షిప్‌ను ఓల్గా స్మారకార్థం తొలిసారిగా నగరంలో నిర్వహించారన్నారు. ప్రపంచంలోని శిక్షకుల్లో నాలుగో స్థానంలో ఉన్న లెనిన్ దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించడం దేశానికి తీరని లోటన్నారు. ఆయన తండ్రి, ఆర్చరీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న చెరుకూరి సత్యనారాయణ ఎంతో అభినందనీయుడని పేర్కొన్నారు. లెనిన్ సోదరి డాలీ శివానీ నాలుగేళ్ల వయసులోనే ఆర్చరీలో అద్భుతాలు ప్రదర్శిస్తూ రికార్డులు స్థాపించడం అభినందించదగ్గ విషయమన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) మాట్లాడుతూ నగరంలో ఆర్చరీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. నగర మేయరు కోనేరు శ్రీధర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ మైదానాల అభివృద్ధికి శాప్ సహాయ సహకారాలు అందించాలని కోరారు. రాష్ట్ర విలువిద్య సంఘం ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శాప్ ఓఎస్‌డీ పి.రామకృష్ణ, కృష్ణా జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కొమ్మారెడ్డి పట్టాభిరామ్, వీఎంసీ ట్రాఫిక్, తదితరులు పాల్గొన్నారు.

## స్టాక్‌మార్కెట్ల హవా.. సెన్సెక్స్, నిఫ్టీ కొత్త రికార్డు



ముంబై: స్టాక్‌మార్కెట్లు ట్రేడింగ్‌లో దూసుకెళ్లాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్, నిఫ్టీలు ఇవాళ కొత్త రికార్డులు సృష్టించాయి. సెన్సెక్స్ అత్యధికంగా 33,117.33 పాయింట్లకు చేరుకున్నది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా చరిత్రాత్మకంగా 10,340.5 పాయింట్లను తాకింది. పబ్లిక్ రంగ బ్యాంకులకు 2.11 లక్షల కోట్లు ప్యాకేజీని కేంద్రం ప్రకటించడంతో ఇవాళ స్టాక్‌మార్కెట్లు దడదడలాడించాయి. సెన్సెక్స్ ఇవాళ 509.99 పాయింట్ల పురోగతి నమోదు చేసింది. ఈనెల 17వ తేదీన నమోదు చేసిన 32,699 పాయింట్ల ట్రేడింగ్ రికార్డును అధిగమించింది. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ షేర్లు ఇవాళ 19.47 శాతం పెరిగాయి. ప్రైవేటు బ్యాంక్‌లు ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్‌లు దాదాపు 8 శాతం ప్రగతిని నమోదు చేశాయి. దీంతో స్టాక్‌మార్కెట్లు ట్రేడింగ్‌లో కొత్త రికార్డులను అందుకున్నాయి. నిఫ్టీ ఇవాళ సుమారు 132.85 పాయింట్ల లాభం నమోదు చేసింది.

ఈనెల 17న నమోదు అయిన రికార్డును నిఫ్టీ కూడా అధిగమించింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ.. బ్యాంకులకు ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించడంతో స్టాక్‌మార్కెట్లు జోరును ప్రదర్శించినట్లు నిపుణులు అంటున్నారు.

## పద్మజ సుజుకి సేవలు మరింత విస్తృతం

**మహిళలకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ**

**అత్యుత్తమ సేల్స్, అత్యాధునిక సర్వీస్, జెన్యూన్ స్పేర్స్ ప్రత్యేకతలు**

**అట్టహాసంగా మురళీనగర్, గాజువాకలలో**

**పద్మజ సుజుకి నూతన షోరూంలు ప్రారంభోత్సవం**

**ఘనంగా ప్రారంభించిన సంస్థ డైరెక్టర్ సతోషి ఉచిడా**




గాజువాక: వరుణ్ ఆటో పార్క్‌వద్ద, మురళీనగర్ వరుణ్ పాయింట్ వద్ద పద్మజ సుజుకి నూతన షోరూంలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రపంచ అగ్రగామి అయిన జపాన్ సుజుకి మోటార్ కార్పోరేషన్ అనుబంధ సంస్థ సుజుకి మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఆథరైజ్డ్ డీలర్ పద్మజ సుజుకి వారి రెండు షోరూంలను సుజుకి మోటర్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతోషి ఉచిడా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుజుకి మోటర్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతోషి ఉచిడా, గౌరవ అతిథులుగా సుజుకి మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ కెంజిహిరోజవా, సజీవ్ రాజశేఖర్ జనరల్ మేనేజర్ దీపక్ ముత్రేజాలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభుకిషోర్ మాట్లాడుతూ పద్మజ సుజుకి సేవలను గాజువాక, మురళీనగర్ పరిసరవాసులకు మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్ధేశ్యంతో ఈ నూతన షోరూంలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ షోరూంలలో సుజుకి అన్ని రకాల స్కూటర్లు, మోటార్ సైకిల్స్ లభిస్తాయన్నారు. అంతే కాకుండా మహిళలకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. స్నేహపూరిత వాతావరణంలో కష్టమర్లకు అత్యుత్తమ సేల్స్, అత్యాధునిక సర్వీస్, జెన్యూన్ స్పేర్స్ లభిస్తాయని అన్నారు. పాత 2వీలర్స్ ఎక్స్‌ఛేంజ్, ఫైనాన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరుణ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, పద్మజ సుజుకి జనరల్ మేనేజర్ హరిప్రసాద్, సిబ్బంది, కష్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇక ఆధార్‌తో మొబైల్ నంబర్ లింక్ మరింత సులువు!

న్యూఢిల్లీ: మొబైల్ నంబర్‌తో ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టంచేసిన విషయం తెలిసిందే. అన్ని టెలికాం ఆపరేటర్లు ప్రస్తుతం ఇదే పనిలో బిజీగా ఉన్నాయి. అయితే ఈ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకున్నది. సర్వీస్ సెంటర్లకు వచ్చి రీ వెరిఫికేషన్ చేయించుకోలేని వాళ్ల కోసం ఇంటి దగ్గరికే టెలికాం సంస్థలు తమ ప్రతినిధులను పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇక ఆధార్ ఆధారిత వన్ టైమ్ పాస్‌వర్డ్ సాయంతోనూ రీ వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలని సూచించింది. అంగవైకల్యం, అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న వారి కోసం ఇంటి దగ్గరికే వెళ్లి రీ వెరిఫికేషన్ చేయడం తప్పనిసరి అని ప్రభుత్వం స్పష్టంచేసింది.

ఇలాంటి సేవలు కావాలని అనుకున్నవాళ్లు ఆన్‌లైన్‌లోనే రిక్వెస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని టెలికాం సంస్థలను ఆదేశించింది. ఇక ఆధార్ ఓటీపీ ద్వారా కూడా రీ వెరిఫికేషన్




చేయాలన్నది మరో నిబంధన. ఎస్సెమ్మెస్, ఐవీఆర్‌ఎస్, మొబైల్ యాప్స్ ద్వారా ఈ ఓటీపీ రీ వెరిఫికేషన్ ప్రక్రియ చేయాలని సూచించింది. దీని ప్రకారం ఆధార్ డేటాబేస్‌లో రిజిస్టర్ అయిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ పంపించడం వల్ల ఆ నంబర్ రీవెరిఫికేషన్ తోపాటు అదే సబ్‌స్క్రయిబర్ కలిగి ఉన్న ఇతర మొబైల్ నంబర్స్‌ను కూడా రీవెరిఫై చేయొచ్చని ప్రభుత్వంలోని ఓ అధికారి వెల్లడించారు. ఇప్పటికే 50 కోట్ల మొబైల్ నంబర్స్ ఆధార్ డేటాబేస్‌లో ఉన్నాయి.

## చక్కెర కర్మాగారాన్ని కొనసాగించాల్సిందే

**డెల్టా యాజమాన్యానికి రైతు సంఘం నాయకుల సూచన**

హనుమాన్‌జంక్షన్ : డెల్టా చక్కెర కర్మాగారాన్ని మూసివేయాలనే ప్రతిపాదన అత్యంత దారుణమని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు సంఘం, సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. యథా ప్రకారం గానుగ ప్రక్రియ కొనసాగించాల్సిందేనని, లేకుంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలని ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు వై.కేశవరావు డిమాండ్ చేశారు. గానుగ తరుణం సమీపించిన తర్వాత కర్మాగారాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించడం ఏ మాత్రం సరికాదన్నారు. ఒక ప్రజాప్రతినిధి యజమానిగా ఉండి, రైతుల్ని నట్టేట ముంచేలా నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. డెల్టా చక్కెర కర్మాగారం యథావిధిగా కొనసాగించాల్సిందేనన్న డిమాండ్‌తో సీఐటీయూ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వేల మంది రైతులకు, వందల మంది కార్మికులకు అశనిపాతంగా మారుతున్న మూసివేత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. నిజంగా నష్టాలు వస్తుంటే ఆ విషయాన్ని రెండేళ్ల ముందుగానే రైతులకు తెలియజేసి, వారికి ఇబ్బంది లేకుండా, కార్మికులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. రైతుల భాగస్వామ్యంతో నిర్మితమైన ఈ కర్మాగారాన్ని కొనసాగించాలన్నదే తమ ప్రధాన డిమాండ్‌గా వీరు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు యం.హరిబాబు, వై.నరసింహరావు, అబ్దుల్ బారి, నల్లి ఆంజనేయులు, బేతా శ్రీనివాసరావు, తోట సాంబయ్య, సీహెచ్.కొండలరావు, తదితరులు పాల్గొన్నారు. తెదేపా నాయకుడు గుండపనేని ఉమాప్రసాద్, వైకాపా నాయకుడు యనమదల సాంబశివరావులు సంఘీబావం ప్రకటించారు.

## కమల్‌పై కేసు పెట్టండి

**మద్రాస్ హైకోర్టు**



చెన్నై : ప్రముఖ సినీనటుడు కమల్‌హాసన్ వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల నేలవేము మొక్కను తన అభిమానులెవరూ పంచొద్దంటూ కమల్ ట్వీట్ చేశారు. తమిళనాడు ప్రభుత్వం డెంగీ వ్యాధికి విరుగుడుగా ఈ మొక్కను పంపిణీ చేస్తోంది. అలాంటి సమయంలో కమల్ చేసిన ఈ వ్యతిరేక ప్రచారం చర్చనీయాంశమైంది. కమల్‌హాసన్ చేసిన ట్వీట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అడ్వకేట్ క్లర్క్ జి.దేవరాజన్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన మద్రాస్ హైకోర్టు కమల్‌పై కేసు నమోదు చేయాలని చెన్నై నగర పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

ఏ వైద్య ప్రమాణాల ఆధారంగా కమల్ నేలవేము మొక్క గురించి ట్వీట్ చేశారో చెప్పాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. ఈ మొక్కను వాడటం వల్ల దుష్ఫలితాలు వస్తాయని కమల్ ఏ ప్రాతిపాదికన చెప్పారో స్పష్టం చేయాలని కూడా దేవరాజన్ పిటిషన్‌లో అడిగారు. ఆయన స్వతహాగా నేలవేము మొక్కను వినియోగించి.. దుష్ఫలితాలను చవిచూశారేమో చెప్పాలని పిటిషనర్ ప్రశ్నించారు. సరైన ఆధారాలు లేకుండా కమల్ నేలవేము మొక్క గురించి ట్వీట్ చేశారని పిటిషనర్ దేవరాజన్ తప్పు బట్టారు.

## లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

అనంతపురం: సత్వరం సులభంగా న్యాయం పొందటానికి శాశ్వత లోక్‌అదాలత్ ఎంతో దోహదపడుతుందని శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. జిల్లా న్యాయ సేవాసదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాశ్వత లోక్‌అదాలత్‌లో ఒక్కో విభాగం నుంచి విశ్రాంత అధికారులను ఎంపిక చేశామన్నారు. విశ్రాంత మున్సిపల్ కమిషనర్ నాగభూషణం, వె%ద్య విభాగం నుంచి రంగస్వామి (విశ్రాంత ఏడీ, ప్రభుత్వ ఆసుపత్రి), బ్యాకింగ్ నుంచి ఏవీఎస్‌రెడ్డి (విశ్రాంత కెనరా బ్యాంకు, మేనేజర్), పుల్లప్ప (విశ్రాంత డీఆర్, కో-ఆపరేటివ్‌శాఖ), ఉపాధి నుంచి గంగయ్య (విశ్రాంత ఏడీ), విధ్యాశాఖ నుంచి కిష్టప్ప(విశ్రాంత ఆర్‌ఐవో), బాలగంగాధర్ (విశ్రాంత అధ్యాపకులు) సభ్యులుగా ఉంటారన్నారు.

## మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

గుంటూరు: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జడ్పీ ఛైర్మన్ పూల నాగరాజు సూచించారు. జడ్పీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒకేరోజు 20 వేల మరుగుదొడ్ల నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐదు మండలాల్లో ఇప్పటి వరకు 13,793 మరుగుదొడ్లను మంజూరు చేశామన్నారు. మరో 18,448 మంజూరు చేయాల్సి ఉందన్నారు. వీటన్నింటిని సకాలంలో పూర్తి చేసేలా ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు.



బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హరేరామనాయక్, సీఈవో స్వరూపారాణి, ఎంపీడీవోలు శ్రీనివాసులు, రెహనాబేగం, శివయ్య, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ ప్రగతే లక్ష్యం




అనంతపురం: బీఎస్ఎన్ఎల్ సంస్థ ప్రగతే లక్ష్యంగా ముందుకెళుతున్నామని, ఇతర మొబైల్ సంస్థలకు ధీటుగా వినియోగదారులకు సేవలు అందిస్తున్నట్లు జిల్లా జనరల్ మేనేజర్ వెంకటనారాయణ పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్ సంస్థ అందిస్తున్న సేవలు, పథకాలపై ప్రచారం చేస్తూ నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వేమన భవన్లో సమావేశమయ్యారు. జీఎం మాట్లాడుతూ వినియోగదారులకు సౌకర్యవంతమైన పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. జిల్లాలో 6 లక్షల మంది మొబైల్ ఫోన్ వినియోగదారులున్నారని, గడువులోగా ఆధార్‌తో రీవెరిఫికేషన్ చేయించడం మన ముందున్న లక్ష్యమన్నారు. ఆధార్ అనుసంధానం కోసం అవసరమైన స్కానర్లను అందజేస్తామన్నారు. బీఎస్ఎన్ఎల్ సంస్థ నష్టాలను అధిగమించిందని, ఇకపై ప్రతి ఉద్యోగి మార్కెటింగ్ చేయాలని, వారంలో రెండ్రోజులు మార్కెటింగ్, ప్రచారం కోసం సమయం కేటాయించాలని సంచార్ నిగం ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, డీజీఎం విశ్వనాథ్ సూచించారు. 2018 ఫిబ్రవరి 6లోగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు ఆధార్‌తో రీ వెరిఫికేషన్ చేయించాలన్నారు. సంచార్ నిగం ఇంజనీర్ల సంఘం జిల్లా కార్యదర్శి లింగమయ్య, ప్రతినిధులు రాజశేఖరరెడ్డి, నాగేశ్వరరావు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, శివప్రసాద్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Vijayawada

Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ☆ e-mail: vijayabhanudaily@gmail.com